E-KABURU
E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

20-04-2025 ఆదివారం | పేజీలు–6 | హైదరాబాద్

ekaburu.com



ఈ నెల 22న తెలంగాణ ఇంటర్ ఫలితాలు 2లో



పక్కకు ఒరిగిన 33కెవి విద్యుత్ స్తంభాలు




# గాలివాన బీభత్సం...

## గోపన్ పల్లిలో ఒరిగిన 33 కెవి విద్యుత్ స్తంభాలు

ఈ-కబురు, శేరిలింగంపల్లి :

నగరంలో శనివారం సాయంత్రం కురిసిన గాలివాన బీభత్సం సృష్టించింది. ఐటీ కారిడార్ కు ఆనుకుని ఉన్న గోపనపల్లిలో గాలివాన కారణంగా 33 కెవి విద్యుత్ స్తంభాలు పక్కకు ఒరిగి ప్రమాదకరంగా మారాయి. శనివారం సాయంత్రం గచ్చిబౌలి ఐటీ కారిడార్ పరిధిలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది సాయంత్రం వేళ భారీ ఈదురు గాలులతో వర్షం పడింది. ఈదురు గాలులు వర్షం కారణంగా గోపన్ పల్లి తండాలో ప్రధాన రహదారిపై ఉన్న 33 కేవి విద్యుత్ స్తంభాలు రెండు రోడ్డు వైపు వంగిపోయాయి. దీంతో గోపన్‌పల్లి, నానక్‌రాంగూడ సబ్ స్టేషన్ల పరిధిలో గంటల పాటు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. వెంటనే విద్యుత్ అధికారులు మరమ్మత్తు చర్యలు చేపట్టారు. ప్రత్యామ్నాయ విధానంలో విద్యుత్ సరఫరాను పునరుద్దరించారు. ఒరిగిన స్తంభాల పునరుద్ధరణ పనులు యుద్ధప్రాతిపదికన చేపడుతున్నారు.

# జపాన్ తెలుగు సమాఖ్య కార్యక్రమానికి హాజరైన సీఎం రేవంత్ రెడ్డి



- తెలంగాణ అభివృద్ధికి ప్రవాసుల సహకారం అవసరం
- పరిశ్రమలు, పెట్టుబడులు, ఉపాధి– ప్రభుత్వ ప్రధాన లక్ష్యం
- హైదరాబాద్‌లో డ్రై పోర్ట్ త్వరలోనే" – సీఎం ప్రకటన
- మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు – జపాన్ నమూనాతో అభివృద్ధి
- "కాలుష్యంతో ఢిల్లీ స్తంభించింది – మేము గుణపాఠం నేర్చుకోవాలి"
- "ప్రపంచంతో పోటీ పడేలా రాష్ట్రాన్ని అభివృద్ధి చేద్దాం"

**ఈ కబురు, హైదరాబాద్:** జపాన్ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అక్కడి తెలుగు సమాఖ్య నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసంగించిన తెలంగాణ అనేక రంగాల్లో ముందడుగు వేస్తోందని అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రైజింగ్ తెలంగాణ ప్రతినిధి బృందం జపాన్‌లో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి జపాన్ తెలుగు సమాఖ్య నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరైన వారిని ఉద్దేశించి ప్రసంగించారు. అనేక రంగాల్లో తెలంగాణ అభివృద్ధి సాధించిందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఐటీ, ఫార్మా రంగంలో సాధించాల్సినంత ప్రగతి సాధించామని అన్నారు. తెలంగాణలో డ్రై పోర్ట్ ఏర్పాటు చేయబోతున్నట్టు తెలిపారు. ప్రపంచంతో పోటీ పడేలా తెలంగాణను అందరం కలిసి అభివృద్ధి చేసుకోవాలని పిలుపు నిచ్చారు. టోక్యోలో అభివృద్ధి చేసిన రివర్ ఫ్రంట్ పరిశీలించామని కూడా సీఎం రేవంత్ తెలిపారు. నీరు మన సంస్కృతికి, అభివృద్ధికి ప్రతీక అని అన్నారు. ఈ సందర్భంగా మూసీ నది గురించి కూడా ప్రస్తావించిన సీఎం నది ప్రక్షాళనకు కొంతమంది అడ్డుపడుతున్నారని అన్నారు. ఢిల్లీలో కాలుష్యంతో అన్ని సంస్థలకు సెలవులు ఇస్తున్న పరిస్థితి నెలకొందని చెప్పారు. కేవలం కాలుష్యంతో ఢిల్లీ నగరం స్థంభించే పరిస్థితిని చూసి అందరం గుణపాఠం నేర్చుకోవాల్సిన అవసరం లేదా అని ప్రశ్నించారు. ఈ కారణంగానే హైదరాబాద్‌లో మూసీ ప్రక్షాళన చేయాలని అన్నారు. మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ, రీజనల్ రింగ్ రోడ్, రేడియల్ రోడ్స్ తెలంగాణ పురోగతికి అత్యంత కీలకమైన అంశాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణలో పెట్టుబడులను ఆకర్షించడం, పరిశ్రమలను అభివృద్ధి చేయడం, ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెంపొందించాలనేదే ప్రభుత్వ ఉద్దేశమని సీఎం స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధిలో అందరి సహకారం అవసరం చెప్పారు. ఎవరికి చేతనైనంత వారు చేయగలిగింది చేస్తే.. ప్రపంచంతోనే తెలంగాణ పోటీ తరువాయి 2లో



# తెలంగాణ యువతకు జపాన్‌లో ఉద్యోగ అవకాశాలకు




## ధాన్యం దిగుబడిలో దేశంలో తెలంగాణ రికార్డ్.. మంత్రి ఉత్తమ్ కీలక వ్యాఖ్యలు

**ఈ కబురు :** రాష్ట్ర వ్యాప్తంగా రబీ సీజన్ లో రైతులు సాగు చేసిన 57 లక్షల ఎకరాలలో 127.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అవుతుందని అంచనా వేసి, 70.13 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా ప్రభుత్వం ఏర్పాట్లు చేసుకుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి వెల్లడించారు. ఈ సీజన్ లో ఉత్పత్తి అయిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. శనివారం పౌర సరఫరాల శాఖా కేంద్ర కార్యాలయంనుండి పౌర సరఫరాల శాఖా ముఖ్య కార్యదర్శి డి.ఎస్.చౌహన్, జాయింట్ కమిషనర్ ప్రియాంకా ఏలే, డైరెక్టర్ ప్రసాద్, జిల్లా కలెక్టర్లు తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఆదిలాబాద్ నుండి రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖామంత్రి దలసరి అనసూయ సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సంవత్సరం రెండు సీజన్ లు కలిపి 281 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అవుతుందని ఇది తెలంగాణాలో కాకుండా దేశంలోనే అరుదైన రికార్డ్ నమోదు చేసుకుందన్నారు. ఖరీఫ్ సీజన్ లో 66.7 లక్షల ఎకరాల్లో సాగు చేస్తే 153.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి కాగా ప్రస్తుత రబీ సీజన్ లో 57 లక్షల ఎకరాల్లో సాగు చేస్తే 127.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా వేస్తున్నామన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాల కల్పనలో ఎటువంటి లోటు పాట్లు లేకుండా ఆయా జిల్లాల కలెక్టర్లు ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు.

ధాన్యం కొనుగోళ్లు సున్నిత మైన అంశమని అధికారులు అప్రమత్తంగా ఉంటూ మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతాంగాన్ని చైతన్యపరచాలన్నారు. ఏప్రిల్ రెండో వారం పూర్తి అయ్యేనాటికి 8.51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేరగా ఇప్పటికే 5.77 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఇందులో సన్నరకాలు 3.79 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉండగా 1.98 లక్షల మెట్రిక్ టన్నులు దొడ్డు రకాలనీ, సన్నాలు పండించిన రైతాంగానికి బోనస్ లు ఎప్పటికప్పుడు వారి వారి ఖాతాలలో జమ చేస్తున్నామన్నారు. ఇప్పటికి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద 2.74 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం చేరిందని, రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం 8,329 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడానికి తరువాయి 2లో



## తుఫానులా తిరిగి అధికారంలోకి వస్తాం.. కేటీఆర్ కీలక వ్యాఖ్యలు

**ఈ కబురు:** రాబోయే ఎన్నికల్లో తుఫానులా బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఇవాళ తెలంగాణ భవన్ లో బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ సన్నాహక సమావేశంపై గ్రేటర్ హైదరాబాద్ నేతలు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అంటేనే మోసమని.. ప్రజలకు అర్థం అయిందని అన్నారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు వచ్చానా గులాబీ పార్టీదే అధికారమని తెలిపారు.

తెలంగాణ బీజేపీ నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులుగా ఉన్నా.. ఒకరు సహాయ మంత్రి, ఇంకొకరు నిస్సహాయ మంత్రి అంటూ కామెంట్ చేశారు. వారిద్దరితో రాష్ట్రానికి రూపాయి కూడా ఉపయోగం లేదని అన్నారు. గత పదేళ్ల కాలంలో జీహెచ్ఎంసీ ఎన్నికలతో పాటు గ్రేటర్ హైదరాబాద్ 3లో

## తప్పించుకోవడానికే బీజేపీతో లోపాయికారీ ఒప్పందం.. కేటీఆర్ కు టీపీసీసీ చీఫ్ కౌంటర్



**ఈ కబురు;** అవినీతి కేసుల నుంచి తప్పించుకోవడానికి బీజేపీతో లోపాయికారీ ఒప్పందం పెట్టుకున్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు. దొంగల ముఠాలా రాష్ట్రాన్ని పదేళ్లు దోచుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నారని దుయ్యబట్టారు. అక్రమాలపై కేంద్రం చర్యలు తీసుకోకుండా నరేంద్ర మోడీకి దాసోహమయ్యారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలపై శనివారం టీపీసీసీ చీఫ్ స్పందించారు. కేటీఆర్ తీరును 3లో

## గచ్చిబౌలి పోలీసులకు వివరణ ఇచ్చిన ఐఏఎస్ స్మితా సబర్వాల్

3లో

## అందుకే ఇప్పుడు మీ ముందు ఇలా ఉన్నా: వెయిట్ లాస్ జర్నీని వెల్లడించిన అమిత్ షా



2లో





## మాదారి మేం చూసుకుంటామన్న అమెరికా.. స్పందించిన రష్యా

2లో

## దేశంలోనే తొలి ప్రోటోటైప్ ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్..

# జపాన్ తెలుగు సమాఖ్య కార్యక్రమానికి హాజరైన సీఎం రేవంత్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి

పడొచ్చని అన్నారు. ఈ దిశగా ఎన్నారైలు తమ ఆలోచనలను రాష్ట్ర ప్రభుత్వంతో పంచుకోవాలని సూచించారు. సొంత ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవడంలో ఉన్న ఆనందం ఏమిటో అందరికీ తెలిసిందేనని అన్నారు. తెలంగాణలో ఐటీ, ఫార్మా రంగంలో సాధించాల్సినంత ప్రగతి సాధించామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. జపాన్ పర్యటనలో ఉన్న ఆయన.. అక్కడి తెలుగు సమాఖ్య కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణలో డ్రై పోర్ట్ ఏర్పాటు చేయబోతున్నామని చెప్పారు. ప్రపంచంతో పోటీ పడేలా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామన్నారు. ''టోక్యోలో అభివృద్ధి చేసిన రివర్‌ఫ్రంట్‌ను పరిశీలించాం. మూసీ నది ప్రక్షాళనకు కొంత మంది అడ్డుపడుతున్నారు. దిల్లీ పరిస్థితిని చూసి మనం గుణపాఠం నేర్చుకోవాల్సిన అవసరం లేదా? మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ, రీజనల్ రింగ్ రోడ్, రేడియల్ రోడ్స్ తెలంగాణ పురోగతికి కీలకం. తెలంగాణకు పెట్టుబడులు రావాలి.. పరిశ్రమలు పెరగాలి. ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెంచాలనేదే ప్రభుత్వ ఉద్దేశం. రాష్ట్ర అభివృద్ధిలో అందరి సహకారం అవసరం. మీ తోడ్పాటుతో ప్రపంచంతోనే మనం పోటీ పడొచ్చు. ఆలోచనలను రాష్ట్ర ప్రభుత్వంతో పంచుకోండి. సొంత ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవడంలో ఉన్న ఆనందం మీకు



తెలుసు'' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ యువతకు జపాన్‌లో ఉద్యోగాల కల్పన కోసం 2 సంస్థలతో ఇక్కడి ప్రభుత్వం ఎంవోయూ కుదుర్చుకుంది. జపాన్‌లోని టీఈఆర్ఎన్, రాజ్ గ్రూప్ ఏజెన్సీలతో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో టామ్‌కామ్ ఒప్పందం చేసుకుంది. దీని ప్రకారం వచ్చే రెండేళ్లలో జపాన్‌లోని హెల్త్‌కేర్, ఇంజినీరింగ్, ఆతిథ్య, నిర్మాణరంగాల్లో 500 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి.
మూసీ ప్రక్షాళనకు అడ్డుపడుతున్నరు..

టోక్యోలో అభివృద్ధి చేసిన రివర్ ఫ్రంట్ పరిశీలించామని రేవంత్‌రెడ్డి అన్నారు. నీరు, మన సంస్కృతికి, అభివృద్ధికి ప్రతీక అని అన్నారు. మూసీ నది ప్రక్షాళనకు కొంతమంది అడ్డుపడుతున్నారని విమర్శించారు. ఢిల్లీలో కాలుష్యంతో అన్ని సంస్థలకు సెలవులు ఇస్తున్న పరిస్థితి ఉన్నదని, కేవలం కాలుష్యంతో ఢిల్లీ స్థంభించే పరిస్థితి ఉంటే మనం గుణపాఠం నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే హైదరాబాద్‌లో మూసీ ప్రక్షాళన చేయాలని తాను చెబుతున్నానని, మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ, రీజనల్ రింగ్ రోడ్, రేడియల్ రోడ్స్ తెలంగాణ పురోగతికి అత్యంత కీలకమైన అంశాలు కాబోతున్నాయన్నారు. సొంత ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవడంలో ఉన్న ఆనందం ఏమిటో మీకు తెలుసని మీ ఆలోచనలను రాష్ట్ర ప్రభుత్వంతో పంచుకోవాలని పిలుపునిచ్చారు.



# తెలంగాణ యువతకు
## జపాన్‌లో ఉద్యోగ అవకాశాలకు

- **జపాన్‌తో కీలక ఒప్పందాలపై సంతకాలు చేసిన (టామ్ కామ్)**
- **ఒప్పందాల ద్వారా 500 అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాలు**
- **తెలంగాణ యువతకు ప్రపంచస్థాయి ఉద్యోగ అవకాశాలకు దారితీసే ముందడుగు**

తెలంగాణ యువతకు అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాలను పెంచే దిశగా కీలక ముందడుగు పడింది. తెలంగాణ ప్రభుత్వానికి చెందిన ప్రభుత్వ సంస్థ అయిన తెలంగాణ ఓవర్సీస్ మాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్ కామ్ ) రెండు ప్రముఖ జపాన్ సంస్థలతో కీలక ఒప్పందాలపై సంతకాలు చేసింది. టోక్యోలో అధికారిక పర్యటనలో ఉన్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రెవంత్ రెడ్డి సమక్షంలో, , రాజ్ గ్రూప్ సంస్థలతో ఈ ఒప్పందాలపై టామ్ కామ్ అధికారికంగా సంతకాలు చేసింది. ఈ ఒప్పందాల ద్వారా జపాన్‌లో పెరుగుతున్న ఉద్యోగ అవసరాలకు అనుగుణంగా తెలంగాణ నుండి నైపుణ్యం గల యువతిని నియమించేందుకు వీలవుతుంది. ఒప్పందాల ప్రకారం రాబోయే 12 సంవత్సరాలలో సుమారు 500 ఉద్యోగాల అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి. వాటిలో.. హెల్త్‌కేర్ (కేర్‌గివింగ్) - 200 ఉద్యోగాలు.. ఇంజినీరింగ్ (ఆటోమొబైల్, మెకానికల్, కంప్యూటర్ సైన్స్/ఐటీ) - 100 ఉద్యోగాలు.. హాస్పిటాలిటీ - 100 ఉద్యోగాలు.. కన్స్ట్రక్షన్ (సివిల్, బిల్డింగ్, మెంటెనెన్స్ తదితరాలు) - 100 ఉద్యోగాలు ఉన్నాయి. తెలంగాణ ప్రభుత్వ కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ ఆధ్వర్యంలోని తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ , జపాన్‌కు చెందిన టెర్న్ గ్రూప్ , రాజ్ గ్రూప్ )లతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, కంపెనీల ప్రతినిధులు ఈ ఒప్పందాలపై సంతకాలు చేశారు జపాన్‌లో ఉద్యోగాలు ఇలా ఈ ఒప్పందాల ద్వారా, రాబోయే 12 సంవత్సరాల్లో జపాన్‌లోని వివిధ రంగాల్లో 500 ఉద్యోగ అవకాశాలు తెలంగాణ యువతకు అందుబాటులోకి రానున్నాయి. వీటిలో ఆరోగ్య సంరక్షణ రంగంలో 200, ఇంజనీరింగ్ (ఆటోమోటివ్, మెకానికల్, ఐటీ) రంగంలో 100, ఆతిథ్య రంగంలో 100, నిర్మాణ రంగం (సివిల్, భవన నిర్మాణం, పరికరాల నిర్వహణ)లో 100 ఉద్యోగాలు ఉన్నాయి. టోక్యో కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహించే గ్రూప్, జపాన్‌లో సాఫ్ట్‌వేర్, ఇంజనీరింగ్ నియామకాల్లో ప్రసిద్ధి చెందిన సంస్థ. అలాగే, రాజ్ గ్రూప్, జపాన్‌లోని ప్రముఖ నర్సింగ్ కేర్ సంస్థ సుకూయి కార్పొరేషన్‌తో కలిసి, సంరక్షకుల (కేర్ టేకర్స్) శిక్షణ, నియామకాలలో తో ఇప్పటికే సహకరిస్తోంది. తాజా ఒప్పందంతో ఈ భాగస్వామ్యం ఆరోగ్యేతర రంగాలకు కూడా విస్తరించనుంది. ఈ ఒప్పందాలు రాష్ట్ర ప్రభుత్వం యువతకు నైపుణ్య శిక్షణతో పాటు అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాలను అందించే లక్ష్యాన్ని స్పష్టంగా ప్రతిబింబిస్తున్నాయి.




# అందుకే ఇప్పుడు మీ ముందు ఇలా ఉన్నా: వెయిట్ లాస్ జర్నీని వెల్లడించిన అమిత్ షా

**దేశ యువత ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పిలుపునిచ్చారు.**

**ఈ కబురు:** కేంద్రహోంమంత్రి అమిత్ షా తన వెయిట్ లాస్ జర్నీని వెల్లడించారు. దేశ యువత ఆరోగ్యంపై దృష్టిసారించాలని సూచించారు. దానివల్ల మరో 4050 ఏళ్లు జీవించి, దేశ వృద్ధికి దోహదం చేసే అవకాశం ఉంటుందని చెప్పారు. వరల్డ్ లివర్ డే సందర్భంగా దిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

తాను పాటిస్తోన్న జీవనశైలిని మంత్రి వెల్లడించారు. ''తగిన నిద్రపోవాలి. నీరు, శరీరానికి సరిపడే పౌష్టికాహారం తీసుకోవాలి. ఇక రోజూ చేసే వ్యాయామం నాకెంతో ఉపయోగపడింది. అందుకే నేను ఇప్పుడు మీ ముందు ఇలా నిల్చున్నాను. నేను ఎలాంటి అల్లోపతి మందులు, ఇన్సులిన్ తీసుకోవడం లేదు. 2020 నుంచి కొనసాగుతోన్న ఈ తరహా వెయిట్ లాస్ జర్నీలో.. నిద్ర, వ్యాయామం అత్యంత కీలకం. వాటిని అంతా సీరియస్‌గా తీసుకోవాలి. శరీరం కోసం రెండు గంటల వ్యాయామం, మెదడు ఆరోగ్యం కోసం ఆరు గంటల నిద్ర ఉండాలి. ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. నా అనుభవం నుంచి ఇదంతా చెప్తున్నా'' అని మంత్రి వెల్లడించారు.

ఇదివరకు ప్రధాని మోదీ కూడా ఇలాంటి సూచనలే చేసిన సంగతి తెలిసిందే. తమ అదనపు బరువును తగ్గించుకోవాలని ప్రజలకు మోదీ సూచించారు. అనేక వ్యాధులకు ఊబకాయమే ప్రధానకారణమని పేర్కొన్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా, వంటనూనెల వినియోగాన్ని 10 శాతం తగ్గించడం ద్వారా శరీరంలోని అధిక కొవ్వును కరిగించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

''మన జీవనశైలితో ముడిపడిన వ్యాధులతో మన ఆరోగ్యానికి భారీ ముప్పు పొంచిఉంది. ఊబకాయం వాటిల్లో ఒకటి. ఇది అనేక వ్యాధులకు మూలకారణంగా నిలుస్తోంది. 2050 నాటికి దేశంలో ఊబకాయుల సంఖ్య 44 కోట్లకు చేరుతుందని ఓ నివేదిక పేర్కొంది. ఈ సంఖ్య చాలా పెద్దది..భయపెట్టేది. నివేదికలోని అంశం వాస్తవరూపం దాలిస్తే..ప్రతిముగ్గురిలో ఒకరు ఊబకాయంతో బాధపడతారు. ఈ పరిస్థితి తలెత్తకుండా ప్రజలు తమ ప్రయత్నాన్ని ప్రారంభించాలి. అదేవిధంగా వంటనూనెల వాడకాన్ని 10 శాతం తగ్గించాలని గతంలోనే సూచించా. వంటనూనెల కొనుగోలును 10 శాతం తగ్గిస్తామంటూ ప్రతిఒక్కరూ ప్రతిజ్ఞ చేయాలి. క్రమం తప్పకుండా చేసే వ్యాయామం, సైక్లింగ్‌తో ఊబకాయం దూరమవుతుంది'' అని మోదీ పేర్కొన్న సంగతి తెలిసిందే.

## మాదారి మేం చూసుకుంటామన్న అమెరికా..
# స్పందించిన రష్యా



**ఉక్రెయిన్‌లో శాంతి స్థాపనకు చర్యలు తీసుకోవడానికి..కీవ్‌తో చర్చలకు తాము సిద్ధంగా ఉన్నట్లు క్రెమ్లిన్ ప్రకటించింది.**

**ఈ కబురు:** రష్యాఉక్రెయిన్ యుద్ధం విషయంలో పురోగతి ఏమీ కనిపించకుంటే.. ఆ రెండు దేశాల మధ్య శాంతి ఒప్పందం కుదిర్చే ప్రయత్నాల నుంచి తాము విరమించుకుంటామని అమెరికా ప్రకటన వెలువరించిన విషయం తెలిసిందే. దీనిపై రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ స్పందించింది. ఉక్రెయిన్‌లో శాంతి స్థాపనకు చర్యలు తీసుకుంటామని..ఈ దిశగా త్వరలో ముందుకు సాగే అవకాశం ఉందని పేర్కొంది. తమ స్వంత ప్రయోజనాలను కాపాడుకోవడానికి.. కీవ్, అమెరికాతో చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ పేర్కొన్నారు. ఈ చర్చలు చాలా క్లిష్టమని అంగీకరించినప్పటికీ..వాటిని కొనసాగించడానికి ప్రయత్నిస్తున్నామన్నారు.

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తమ అధినేత పుతిన్‌కు మధ్య ప్రస్తుతం ముందస్తు సమావేశాలు లేవని..కానీ అవసరం అయితే వెంటనే సమావేశమవుతామని డిమిత్రి పెస్కోవ్ తెలిపారు. ఈ ఘర్షణ విషయంలో ఐరోపా దేశాలు ఉక్రెయిన్‌పై ఎలాంటి ఒత్తిడి తీసుకురావట్లేవని విమర్శించారు. సైనికీకరణ గురించి తప్ప ఆ దేశాల నుంచి ఎటువంటి శాంతి పిలుపులు లేవని అన్నారు. కాగా పారిస్‌లో జరిగిన భేటీలో శాంతి ఒప్పందం ముసాయిదాకు ఐరోపా దేశాల నేతల నుంచి సానుకూల స్పందన వచ్చిన నేపథ్యంలో వచ్చే వారం లండన్‌లో మరో రౌండ్ చర్చలు జరగనున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి.

యుద్ధం విషయంలో చర్చలు ఓ కొలిక్కి రాకపోవడం పట్ల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ శుక్రవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. యుద్ధ విరమణ చేయించాలన్న తన ప్రయత్నాలకు ఆ రెండు దేశాలు సహకరించడంలేదని తెలిపారు. ఘర్షణ ముగించేందుకు కొన్ని నెలలుగా జరుగుతున్న ప్రయత్నాలు విఫలమైనా, రష్యాఉక్రెయిన్ శాంతి ఒప్పందంలో పురోగతి సాధించలేకపోయినా చర్చల ప్రక్రియ నుంచి అమెరికా వైదొలిగేందుకు వెనుకాడబోదని స్పష్టం చేశారు. రష్యా, ఉక్రెయిన్‌లలో ఏ దేశమైనా సరే ఏ ఒక్క కారణంతోనైనా శాంతి ప్రక్రియ నుంచి తప్పుకుంటే రెండు పక్షాలనూ తెలివితక్కువ వారుగా, మూర్ఖులుగా పరిగణిస్తామని శుక్రవారం శ్వేతసౌధంలో ట్రంప్ వ్యాఖ్యానించారు.




## ధాన్యం దిగుబడిలో దేశంలో తెలంగాణ రికార్డ్..
# మంత్రి ఉత్తమ్ కీలక వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి

నిర్ణయం తీసుకోగా ఇప్పటికే 7,337 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామన్నారు. నిజామాబాద్, కామారెడ్డి, సిద్దిపేట, నల్లగొండ జిల్లాలో పూర్తి స్థాయిలో దాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంబించగా మిగిలిన జిల్లాలో వరికోతలను దృష్టిలో పెట్టుకుని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. కొనుగోలు కేంద్రాలకు గ్రేయిన్ కాలిపర్స్, ఎలక్ట్రానిక్ తూకపు మిషన్లు, మాయిశ్చర్ మీటర్లతో పాటు టార్బాలిన్లు,క్లినర్లు,హస్క్ రిమువర్ వంటి యంత్రాలను తరలించినట్లు వెల్లడించారు. 17.5 కోట్ల గన్ని బ్యాగులు అవసరం ఉండగా 9.45 కోట్లు కొత్తవి,8.05 కోట్లు పాతవి ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం 9.23 కోట్ల గన్ని బ్యాగులు అందుబాటులో ఉన్నాయన్నారు.

66.65 లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం నిల్వలకు సరిపడ గోదాములు : ధాన్యం నిల్వ చేసేందుకు 66.65 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం కలిగిన గోదాములు ఉండగా అందులో 25 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ చేసేందుకు అవకాశం ఉందని మిగిలిన ధాన్యాన్ని నిలువ చేసేందుకు వ్యవసాయ మార్కెట్ కమిటీ,రాష్ట్ర గిడ్డంగుల సంస్థకు చెందిన గోదాములతో పాటు ప్రవైట్ గోదాములలో ధాన్యాన్ని నిలువ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ముందెన్నడూ లేని రీతిలో సన్నాలకు రూ. 500 బోనస్ ఇస్తుండడంతో లబ్ది పొందేందుకు సరిహద్దు రాష్ట్రల నుండి అక్రమంగా తరలించే అవకాశాలు ఉన్నాయని,ఆ ప్రయత్నాలను నిర్ద్వంద్వంగా అడ్డుకుంటామని తెలంగాణ ప్రభుత్వం అందించే బోనస్ తెలంగాణా రైతాంగానికే చేరాలని స్పష్టం చేశారు.

అదే సమయంలో అనధికార రవాణా వ్యవస్థను అడ్డుకునేందుకు సరిహద్దు చెక్ పోస్టులాలి సి.సి కెమెరాలతో గట్టి నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశామని, దాన్యం కొనుగోలులో బ్యాంక్ గ్యారెంటీలతో పాటు ప్రభుత్వం నుండీ ఒప్పందం కలిగిన మిల్లర్లను మాత్రమే అనుమతించడం జరుగుతుందన్నారు. అదే విదంగా సన్నాలను గుర్తించేందుకు వీలుగా కేర్నల్ మెట్రిక్,మైక్రో మీటర్లలతో ఫీల్డ్ ఆఫీసర్లకు శిక్షణ ఇచ్చామన్నారు. ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టి అమలు పరుస్తున్న సన్న బియ్యం పంపిణీలో 25 శాతం నూకలు ఉండడం భారత ఆహార సంస్థ నిబంధనలలో భాగమే నన్నారు. ఈ విషయంలో విపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారం పట్ల అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఉద్బోధించారు. ఫిలిప్పీన్స్ తో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఇప్పటికే లక్ష మెట్రిక్ టన్నుల దాన్యం ఎగుమతి చేయాలని నిర్ణయించామన్నారు. ఇప్పటికే మొదటి దశలో 12,500 మెట్రిక్ టన్నులు పంపించాగా రెండో దశలో పంపిణీకి రంగం సిద్ధమైందన్నారు.

# ఈ నెల 22న తెలంగాణ ఇంటర్ ఫలితాలు

**హైదరాబాద్:** తెలంగాణ ఇంటర్ పరీక్షా ఫలితాలు ఈ నెల 22న విడుదల కానున్నాయి. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఫలితాలను విడుదల చేయనున్నారు. గత నెల 5 నుంచి 25వ తేదీ తెలంగాణలో ఇంటర్మీడియట్ విద్యార్థులు ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తున్న టీజీ ఇంటర్ ఫలితాలను విడుదల చేసేందుకు ఇంటర్మీడియట్ బోర్డ్ సిద్ధమైంది. ఏప్రిల్ 22వ తేదీన టీఎస్ ఇంటర్ రిజల్ట్స్ విడుదల చేయనున్నారు. ఈ ఫలితాలను డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క చేతుల మీదుగా విడుదల చేయనున్నట్లు ఇంటర్ బోర్డ్ తెలిపింది. ఇంటర్ ఫస్ట్ ఇయర్ సెకండ్ ఇయర్ ఫలితాలను ఒకేసారి విడుదల చేయనున్నారు. ఏప్రిల్ 22వ తేదీన నాంపల్లిలోని ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయంలో ఉదయం 11 గంటలకు డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క టీజీ ఇంటర్మీడియట్ ఫలితాలను విడుదల చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఇంటర్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య సహా అధికారులు పాల్గొననున్నారు. ఇంటర్ ఫలితాలు నేరుగా ఇంటర్మీడియట్ బోర్డు అధికారిక వెబ్‌సైట్ https://tgbie.cgg.gov.in/ వెబ్‌సైట్ ద్వారా చెక్ చేసుకోవచ్చు. ఫలితాలు విడుదలైన



తర్వార విద్యార్థులు తమ హాల్ టికెట్ నెంబర్ , పుట్టిన తేదీ ఎంటర్ చేసి ఫలితాలు చెక్ చేసుకోవచ్చు. ఇక.. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 5వ తేదీ నుంచి 25వ తేదీ వరకు 1532 కేంద్రాల్లో నిర్వహించారు. ఈ పరీక్షలకు 9,96,971 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరంతా రిజల్ట్స్ కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. అయితే.. మార్చి 18వ తేదీ నుంచి స్పాట్ వాల్యుయేషన్ ప్రారంభించింది. అనంతరం రీవెరిఫికేషన్, కంప్యూటరీకరణం తదితర ప్రక్రియలు ప్రారంభించింది. మొదటగా రాండం రీవాల్యుయేషన్ సైతం నిర్వహించి ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఇంటర్మీడియట్ బోర్డ్ జాగ్రత్తలు తీసుకుంది. దాదాపు 60 వేల మంది ప్రతి సంవత్సరం రీవాల్యుయేషన్‌కు అప్లయ్ చేస్తున్నారని దృష్టిలో పెట్టుకొని పాస్ మార్కులకు దగ్గర్లో ఉన్న వారి పేపర్లను రీవాల్యుయేషన్ చేసినట్లు అధికారులు తెలిపారు. దీంతో రెండు దశల్లో పరిశీలన చేసిన తర్వాతే ఫలితాల వెల్లడికి ఇంటర్ బోర్డు సిద్ధమైంది. ఫలితాల వెల్లడి తర్వాత రీకౌంటింగ్, రీవాల్యుయేషన్‌కు సైతం అవకాశం ఇవ్వనున్నారు. నెల రోజుల్లో సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించేందుకు సైతం ఏర్పాట్లు చేస్తున్నారు.

**టీజీ 10వ తరగతి ఫలితాలు ఎప్పుడంట?**

తెలంగాణలో మార్చి 21న ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ 2వ తేదీతో ముగిశాయి. మొత్తం 2,650 కేంద్రాల్లో రాష్ట్రవ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు నిర్వహించారు. దాదాపు 5 లక్షల మంది విద్యార్థులు ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షలు రాసినట్లు సమాచారం. పలు ప్రాంతాల్లో క్వశ్చన్ పేపర్ లీకేజీ ఘటనలు మినహా పరీక్షలు ప్రశాంతంగా ముగియడంతో.. తెలంగాణ ఎస్‌సీ బోర్డు మూల్యాంకనం నిర్వహించేందుకు సిద్ధమైంది.





హైడ్రా అధికారులు చేపట్టిన కూల్చివేతలు

# మరో హైడ్రా 'శనివారం'...

**నగరంలో మరోసారి హైడ్రా కూల్చివేతలు**
**హఫీజ్ పేట్, రాయదుర్గం ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాల కూల్చివేత**
**ఆంధ్రా టీడీపీ ఎమ్మెల్యే వసంత క్రిష్ణ ప్రసాద్ కు షాక్ - కార్యాలయం నేలమట్టం**
**నోటీసు లేకుండా కూల్చివేతలా : ఎమ్మెల్యే వసంత**

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :**
హైడ్రా మరో శనివారం తన పంజా విసిరింది. నగరంలో మరోసారి కూల్చివేతలతో అక్రమార్కుల గుండెల్లో దడ పుట్టించింది. హైటెక్ సిటీ పరిధిలోని హఫీజ్ పేట్, రాయదుర్గం ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను నేలమట్టం చేసింది. నగరంలో హైడ్రా చేపట్టిన కూల్చివేతలు ఆంధ్రప్రదేశ్ లో ప్రకంపనలు సృష్టించాయి. హఫీజ్ పేటలో హైడ్రా చేపట్టిన కూల్చివేతల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మైలవరం టిడిపి ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ కార్యాలయం, నిర్మాణాలు ఉండడం తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశాలుగా మారింది. శనివారం నగరంలో పలు ప్రాంతాల్లో హైడ్రా చేపట్టిన కూల్చివేతల వివరాలు హైడ్రా అధికారుల కథనం ప్రకారం ఇలా ఉన్నాయి...

శేరిలింగంపల్లి మండల పరిధిలోని హఫీజ్ పేట్ సర్వే నెంబర్ 79లో మొత్తం 39.2 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. రెవెన్యూ రికార్డుల్లో సైతం నేటికీ ప్రభుత్వ స్థలంగా, నిషేధిత జాబితాలో ఉంది. ఈ సర్వే నెంబర్ లోని భూమిలో ఇప్పటికే సగానికి పైగా ఆక్రమణకు గురై నిర్మాణాలు వెలిశాయి. దాదాపు 19 ఎకరాల విస్తీర్ణంలో నివాస గృహాలు వెలువగా, ఖాళీగా ఉన్న 20 ఎకరాల ప్రభుత్వ భూమిలో సైతం పలు కార్యాలయాలు భారీ వాణిజ్య సముదాయం షెడ్లు నిర్మించారు. సర్వే నెంబరు 79/1గా సృష్టించి, ప్రభుత్వ వ్యవస్థలను తప్పుదోవ పట్టించి వసంత హోం సంస్థ నిర్మాణాలు చేపట్టిందని హైడ్రాకు పలు ఫిర్యాదులు అందాయి. ఈ భూములపై సుప్రీంకోర్టులో చాలా కాలంగా సిఎస్14/58 వాజ్యం పెండింగులో ఉండగా, కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ అక్రమంగా నిర్మాణాలు చేపట్టి వివిధ సంస్థలకు అద్దెకు ఇచ్చినట్లు హైడ్రా గుర్తించింది. వసంత హోమ్స్ నిర్మాణ సంస్థ కార్యాలయం సైతం ఇదే స్థలంలో ఉన్నట్లుగా గుర్తించారు. సదరు ప్రభుత్వ భూమిపై కోర్టులో కేసులు నడుస్తుండగా, ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని నిబంధనలు ఉన్నా, నిర్మాణదారులు పట్టించుకోకుండా నిర్మాణాలు చేపట్టారని హైడ్రాధికారులు తెలిపారు. ఫైనల్ డిక్రి రాకుండానే సదరు భూముల్లో నిర్మాణాలు ఏ విధంగా చేపడుతున్నారని కోర్టు సైతం గతంలో విస్మయం వ్యక్తం చేసిందన్నారు. కాగా తాము రోజు ఆడుకునే స్థలంలో క్రికెట్ ఆడుకోనివ్వడం లేదని, స్థానికంగా ఉన్న చెరువును సైతం మాయం చేసి రహదారులు నిర్మిస్తున్నారని పలువురు యువకులు హైడ్రా కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన హైడ్రా అధికారులు శనివారం ఉదయం వివాదాస్పద ప్రభుత్వ భూమిలో చేపట్టిన నిర్మాణాలను కూల్చివేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మైలవరం టిడిపి ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ కు చెందిన వసంత హోమ్స్ నిర్మాణ సంస్థ కార్యాలయాన్ని, షెడ్లను జెసిబి తో నేలమట్టం చేశారు.

**నోటీసులు ఇవ్వకుండా కూల్చివేతలా...**
కాగా హైడ్రా కూల్చివేతలపై స్పందించిన ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ తన వ్యక్తిగత ప్రతిష్టను దిగజార్చేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. కూల్చివేతలపై తాను కోర్టును ఆశ్రయిస్తానని, న్యాయం గెలుస్తుందని తెలిపారు. హైడ్రా కూల్చివేతలు చేపట్టిన భూమి తన ప్రైవేటు ఆస్తి అని ప్రభుత్వ భూమి అయితే వారాంతంలో ఎందుకు కూల్చివేస్తున్నారని ప్రశ్నించారు. 2014లోనే సదరు భూమిపై ప్రభుత్వం మెమో ఇచ్చిందన్నారు. హైడ్రా అధికారులు తమకు నోటీసులు సైతం ఇవ్వకుండా కూల్చివేతలు చేపట్టారని వాపోయారు. గతంలో ఓ చిన్న కాగితం ఇచ్చి ఆఫీసుకు రమ్మన్నారని, అన్ని పత్రాలను సమర్పించి వివరణ ఇచ్చాను అన్నారు. కానీ ఎటువంటి నోటీసులు లేకుండా శనివారం ఉదయం ఒక్కసారిగా వచ్చి కూల్చివేతలు చేపట్టారని దీనిపై కోర్టుకు వెళ్తానని తెలిపారు.



**రాయదుర్గంలో...**
శేరిలింగంపల్లి మండల పరిధిలోని రాయదుర్గం సర్వే నెంబర్ 5/2లో గల 39 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు కొనసాగుతున్నాయని హైడ్రా అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీనిపై స్పందించి సదరు భూమిని హైడ్రా అధికారులు పరిశీలించారు. సదరు భూమిలో ఓవైపు ల్యాండ్ గ్రాబింగ్ కేసులు ఉన్నట్లు బోర్డులు ఏర్పాటు చేయగా, మరోవైపు అక్కడ ప్లాట్ల కొనుగోలుకు సంబంధించిన ఫోన్ నెంబర్లతో నార్నే ఎస్టేట్ సంస్థ బోర్డులు ఏర్పాటు చేసిందన్నారు. అనుమతి లేని లేఅవుట్లో రహదారుల నిర్మాణం చేపడుతూ నార్నే నిర్మాణ సంస్థ ప్లాట్ల అమ్మకాలు చేస్తుందని చెరువును సైతం కబ్జా చేసినట్లు గుర్తించామని హైడ్రాధికారులు తెలిపారు. ఈ మేరకు శనివారం సదరు భూమిలో ఆక్రమణలను తొలగించి ప్రభుత్వ స్థలం బోర్డులను ఏర్పాటు చేశారు.

# బీఆర్ఎస్ రజతోత్సవ సభకు

## శేరిలింగంపల్లి శ్రేణులు తరలిరండి : కొమిరిశెట్టి సాయిబాబా



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ కార్పొరేటర్ సాయిబాబా



ఛలో వరంగల్ పోస్టర్ ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**హఫీజ్ పేట్ డివిజన్ ముఖ్య నాయకుల సమావేశం**

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :**
బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ శ్రేణులు భారీ ఎత్తున తరలిరావాలని నియోజకవర్గం సీనియర్ నాయకులు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా పిలుపునిచ్చారు. ఈ మేరకు రజతోత్సవ సభ సన్నాహక సమావేశాల్లో భాగంగా శనివారం హఫీజ్ పేట్ డివిజన్ ముఖ్య నాయకుల విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావుతో కలిసి కొమిరిశెట్టి సాయిబాబా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీన వరంగల్ లో బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను భారీ ఎత్తున నిర్వహిస్తుందన్నారు. ఈ రజతోత్సవ సభకు బీఆర్ఎస్ అధినేత కేసిఆర్, పార్టీ అగ్ర నాయకులు హాజరవుతున్నారని తెలిపారు. రజతోత్సవ సభలో బీఆర్ఎస్ పార్టీ భవిష్యత్ కార్యాచరణను అధినేత కేసిఆర్ ప్రకటించనున్నారని అన్నారు. అత్యంత కీలకమైన ఈ సభకు శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఉద్యమకారులు భారీ ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. దశాబ్దాల తెలంగాణ ప్రజల ప్రత్యేక రాష్ట్ర కలను సాకారం చేసి, రాష్ట్ర ఏర్పాటు అనంతరం ఉత్తమ పాలనను అందించిన బీఆర్ఎస్ గొప్పతనాన్ని ప్రజల ముందు ఉంచాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. ఈ సందర్భంగా రజతోత్సవ సభ కోసం సిద్ధం చేసిన చలో వరంగల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ గౌడ్, వాలా హరీష్ రావు, మిద్దెల మల్లారెడ్డి, బాబు మోహన్ మల్లేష్, శేఖర్ గౌడ్, జమీర్, శ్రీనివాస్ గౌడ్, తిరుపతి రెడ్డి, రవీందర్ రెడ్డిలతో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తుఫానులా తిరిగి అధికారంలోకి వస్తాం.. కేటీఆర్ కీలక వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి

పరిధిలో అసెంబ్లీ స్థానాలను బీఆర్ఎస్ క్లీన్ స్వీప్ చేసిందని, హైదరాబాద్ ప్రజల ముందు బీజేపీ, కాంగ్రెస్ డ్రామాలు పని చేయవని అన్నారు. హైడ్రా పేరుతో రేవంత్ సర్కార్ నగరంలో విధ్వంసం సృష్టిస్తోందని.. శని, ఆదివారాల్లో ప్రజలెవరూ కూల్చివేతలపై కోర్టులకు వెళ్లకుండా కూల్చివేతలకు చేపడుతోందని అన్నారు. ఫలితంగా హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ కుదేలైందని అన్నారు. ఢిల్లీ కి మూటలు మోసేందుకు మూసీ సుందరీకరణ అంటూ ఫైర్ అయ్యారు. హెచ్‌సీయూ భూములపై సర్కార్ కన్నేస్తే.. విద్యార్థులు ఏకమై పోరాటం చేశారని.. వారికి బీఆర్ఎస్ కూడా మద్దతు తెలిపిందని అన్నారు. ప్రజల ఆశీర్వాదంతో కేసీఆర్ పదేళ్ల పాటు సీఎంగా ఉన్నారని.. భవిష్యత్తులో కూడా ఆయన సీఎం అని తెలిపారు. నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ల పేర్లను ఈడీ చార్జిషీట్ లో నమోదు చేస్తే.. సీఎంగా ఉన్న రేవంత్ రెడ్డి ఒక్క మాట కూడా బీజేపీ కి వ్యతిరేకంగా మాట్లాడడం లేదని ఆరోపించారు. చోటే భాయ్.. బడే భాయ్‌కి మధ్య ఉన్న స్నేహం ఇక్కడ బట్టబయలైందని అన్నారు. రేపు జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికలను బీఆర్ఎస్ బాయికాట్ చేస్తున్నాయని.. పార్టీ తరఫున కౌన్సిలర్లకు విప్ జారీ చేస్తామని అన్నారు. ఒకవేళ విప్‌ను ధిక్కరించి ఎవరైనా ఓటింగ్‌లో పాల్గొంటే వారిపై చర్యలు తీసుకుంటామని కేటీఆర్ అన్నారు.

## గచ్చిబౌలి పోలీసులకు వివరణ


# ఇచ్చిన ఐఏఎస్ స్మితా సబర్వాల్

**అ పోస్టును 2వేల మంది రీట్వీట్ చేశారు.. అందరిపై ఇటువంటి చర్యలేనా : స్మితా సబర్వాల్**

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :**
కంచ గచ్చిబౌలి భూముల వివాదం నేపథ్యంలో తెలంగాణ పర్యాటక శాఖ కార్యదర్శి, సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ వివరణను గచ్చిబౌలి పోలీసులు తీసుకున్నారు. ఈ మేరకు శనివారం స్మితా సబర్వాల్ కార్యాలయానికి వెళ్లిన గచ్చిబౌలి పోలీసులు సీనియర్ ఐఏఎస్ అధికారి స్టేట్మెంట్ ను రికార్డు చేశారు. కంచ గచ్చిబౌలి భూముల వివాదం నేపథ్యంలో మార్చి 31వ తేదీన హాయ్ హైదరాబాద్ అనే ఎక్స్ హ్యాండిల్ చేసిన పోస్టును సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ రీ పోస్టు చేశారు. గిబ్లీ యాప్ లో రూపొందించిన ఇమేజ్ లో కంచ గచ్చిబౌలి మష్రూమ్ రాక్స్, నెమళ్లు, జింకలు, జేసీబీలు కనిపిస్తున్నాయి. కాగా ఈ ఫోటోను నకిలీ ఫోటోగా గుర్తించిన గచ్చిబౌలి పోలీసులు దాన్ని షేర్ చేసిన ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ కు నోటీసులు జారీ చేశారు. ఇందులో భాగంగా శనివారం స్మితా సబర్వాల్ స్టేట్మెంట్ తీసుకున్న గచ్చిబౌలి పోలీసులు రికార్డు చేశారు.



**అందరిపై ఇటువంటి చర్యలేనా : స్మితా సబర్వాల్**
కాగా గచ్చిబౌలి పోలీసుల నోటీసులు, విచారణపై స్మితా సబర్వాల్ ఎక్స్ వేదికగా స్పందించారు. ఒక బాధ్యతాయుతమైన పౌరురాలిగా గచ్చిబౌలి పోలీసులకు పూర్తిగా సహకరించాలని, చట్టాన్ని గౌరవించే వ్యక్తిగా తన పూర్తి స్టేట్మెంట్ ను ఇచ్చానని తెలిపారు. తాను రీషేర్ చేసిన హాయ్ హైదరాబాద్ పోస్టును 2వేల మంది రీషేర్ చేశారని, వారందరిపై ఇటువంటి చర్యలే తీసుకుంటారా అని ప్రశ్నించారు. చట్టం అందరికీ సమానమా, లేక ఎంపిక చేసిన వారిని టార్గెట్ చేస్తున్నారా అని నిలదీశారు.






రాంరెడ్డి చికెన్ సెంటర్ ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి

## ఎన్టీఆర్ నగర్ లో నూతన రామ్ రెడ్డి చికెన్ మార్ట్ ప్రారంభించిన గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :**
శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన రామ్ రెడ్డి చికెన్ మార్ట్ ను శనివారం గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ నాణ్యతతో కూడిన పౌష్టిక ఆహారాన్ని వినియోగదారులకు అందించి మంచి పేరును గడించాలన్నారు. మార్కెట్ లో ఉన్న పోటీని తట్టుకుని మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు చేపట్టకపోవడంతో నేటి యువత స్వయం ఉపాధి వైపు దృష్టి సారిస్తున్నారని అన్నారు. చికెన్ సరఫరా లో నాణ్యత పాటించడంతో పాటు వ్యాపార సముదాయాన్ని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకొని కస్టమర్లను ఆకర్షించాలని సూచించారు. వ్యర్థాలను సేకరించే వారికే అందజేయాలని, వ్యాపార సముదాయాల నిర్వాహకులు సామాజిక బాధ్యతను నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ప్రభాకర్ , సుమన్, కృష్ణ, శివ, వెంకటేష్, మధు, సాయి, రామ్ రెడ్డి చికెన్ షాప్ యాజమాన్యం శివ ముదిరాజ్, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేస్తున్న డైరెక్టర్ పూర్ణచందర్

## జేఈఈ మెయిన్స్ లో సత్తా చాటిన 'రెసోనెన్స్ కళాశాల విద్యార్థులు

**ఉత్తమంగా రాణించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు**

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :**
ఆల్ ఇండియా జేఈఈ మెయిన్స్ 2025లో హైదరాబాద్‌లోని 'రెసోనెన్స్' జూనియర్ కళాశాలల విద్యార్థులు సత్తా చాటారు. తాజాగా విడుదల చేసిన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో రెసోనెన్స్ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించి చారిత్రాత్మక విజయాన్ని అందుకున్నారు. ఈ మేరకు మాదాపూర్ లో గల రెసోనెన్స్ స్కూల్ విజ్డమ్ క్యాంపస్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను రెసోనెన్స్ డైరెక్టర్ పూర్ణచంద్రరావు సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జరిగిన ఈ ప్రతిష్టాత్మక పరీక్షలో తమ విద్యార్థులు అద్భుత విజయం సాధించడంతో రెసోనెన్స్ ప్రతిభ మరోసారి నిరూపితమైందన్నారు. ఐఐటీ, ఎన్ఐటీ, నీట్, ఇతర మెడికల్ ప్రవేశ పరీక్షల్లో అగ్రశ్రేణి ర్యాంకులు సాధించడంలో ముందంజలో ఉన్నామన్నారు. రెసోనెన్స్ విద్యార్థి అర్చిస్మాన్ 295/300 స్కోర్ చేయడంతో ఓపెన్ కేటగిరీలో ఆల్ ఇండియా ర్యాంక్ 13 వచ్చిందన్నారు. హైదరాబాద్ రెసోనెన్స్ జూనియర్ కళాశాలలకు చెందిన ముగ్గురు విద్యార్థులు వివిధ సబ్జెక్టుల్లో 100 పర్సెంటేజ్ సాధించారన్నారు. 57 మంది విద్యార్థులు 99 పర్సెంటైల్ పైగా మార్కులు సాధించారన్నారు. మొత్తం 285 మంది విద్యార్థులకు విభిన్న సబ్జెక్టుల్లో 99 పర్సెంటైల్ పైగా వచ్చాయన్నారు. హైదరాబాద్‌లోని అన్ని క్యాంపస్‌ల నుంచి 1500 మంది విద్యార్థులు అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హత పొందారన్నారు. అందులో 57 మంది విద్యార్థులు 99 శాతం పైగా సాధించడం గర్వంగా ఉందన్నారు. ఇది తమ విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కృషికి నిదర్శనమన్నారు. టాప్ 4 విద్యార్థులకు ప్రోత్సాహకంగా ఒక్కొక్కరికి 1లక్ష రూపాయల స్కాలర్‌షిప్ ఇవ్వడం జరిగిందన్నారు. హైదరాబాద్ క్యాంపస్‌ల నుంచి పల్లా శివ సంకేత్ రెడ్డి, పీ వెన్నెల, పీ దివిత్ రెడ్డి వివిధ సబ్జెక్టుల్లో 100 పర్సెంటైల్ సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## తప్పించుకోవడానికే బీజేపీతో లోపాయికారీ ఒప్పందం.. కేటీఆర్ కు టీపీసీసీ చీఫ్ కౌంటర్

మొదటి పేజీ తరువాయి

ప్రశ్నించారు.

తీవ్రంగా ఖండిస్తూ కౌంటర్ ఏటాక్ చేశారు. బీఆర్ఎస్ నేతల బలహీనతలను ఆసరాగా తీసుకున్న బీజేపీ రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన వాటాలను, నిధులను ఇవ్వకుండా అన్యాయం చేసిందన్నారు.

సొంత ప్రయోజనాలకే పెద్ద పీట వేసి, బీజేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించకపోవడంతో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిపోయిందని పేర్కొన్నారు. పదేళ్లలో కేంద్రంలోని బీజేపీ సర్కార్ ప్రవేశపెట్టిన బిల్లులకు మద్దతు ఇచ్చింది బీఆర్ఎస్ కాదా? కేటీఆర్ ను ఆయన పశ్నించారు. పదేళ్లలో మోదీ తీసుకున్న అనాలోచన నిర్ణయాలన్నింటికీ మద్దతిచ్చిన బీఆర్ఎస్ ఇప్పుడు కాంగ్రెస్‌ను ప్రశ్నించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎమ్మెల్సీ కవితని లిక్కర్ స్కాం నుంచి కాపాడేందుకు బీజేపీకి ఊడిగం చేసింది నిజం కాదా? అని ప్రశ్నించారు.

బీజేపీకి కట్టు బానిసలా కేటీఆర్ పని చేస్తున్నారని, బీజేపీపై బీఆర్ఎస్ ప్రేమతోనే హెచ్‌సీయూపై రెండు పార్టీ నేతల దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. సంఖ్యా బలం లేని బీజేపీ ఏ పార్టీ అండ చూసుకొని పోటీ చేస్తోందో? చెప్పాలని డిమాండ్ చేశారు. లోకల్ బాడీ ఎన్నికలో బీజేపీని గెలిపించేందుకే కేటీఆర్ తాపత్రయ పడుతున్నారని పేర్కొన్నారు. "పదిహేను నెలల స్వల్ప కాలంలో రికార్డు స్థాయిలో పెద్ద ఎత్తున ఉద్యోగాలివ్వడం, రైతు, మహిళా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం, బీసీలకు 42 రిజర్వేషన్లు ఇవ్వడం, ఎస్సీ వర్గీకరణ చేయడం, పేదలకు సన్న బియ్యం అందించడం వంటి గొప్ప పనులను రేవంత్ రెడ్డి సర్కార్ చేపట్టినా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం మీ అజ్ఞానానికి నిదర్శనం" అని పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ ఈసందర్భంగా పేర్కొన్నారు.



## ఫోన్ రీచార్జ్‌లకు జేబులు ఖాళీ! త్వరలో మరోసారి టారిఫ్‌ల పెంపు?

**ఫోన్ రీచార్జ్‌లకు వినియోగదారుల జేబులు ఖాళీ అయ్యే పరిస్థితులు త్వరలో రాబోతున్నాయి. దేశంలోని ప్రముఖ టెలికాం ఆపరేటర్లు అయిన భారతీ ఎయిర్‌టెల్, రిలయన్స్ జియో, వోడాఫోన్ ఐడియా (విఐ) రానున్న డిసెంబర్ నాటికి తమ టారిఫ్‌లను 10-20% పెంచే అవకాశం ఉందని ఒక నివేదిక తెలిపింది.**

ఇది ఆరు సంవత్సరాలలో నాలుగో అతిపెద్ద టారిఫ్ పెంపు కానుంది. టెలికాం కంపెనీలు చివరిసారిగా 2024 జులైలో టారిఫ్‌లను పెంచాయి. 4G, 5G మౌలిక సదుపాయాలపై పెట్టిన పెట్టుబడులను రాబట్టుకునేందుకు, ఆదాయాన్ని పెంచుకునేందుకు 25 శాతం వరకూ టెలికాం సంస్థలు టారిఫ్‌లను పెంచాయి.

గ్లోబల్ బ్రోకరేజీ సంస్థ బెర్న్‌స్టీన్ విశ్లేషకుల ప్రకారం.. భారత్‌లో టెలికాం టారిఫ్‌లలో సుమారు 15% పెంపు ఉండే అవకాశం ఉంది. టెలికాం కంపెనీలు 10% టారిఫ్ కాంపౌండ్ యాన్యువల్ గ్రోత్ రేట్ సాధించడానికి టారిఫ్‌ల పెంపు దోహదపడనున్నది. ఇండియన్ టెలికాం మార్కెట్‌లో పోటీ తీవ్రత కారణంగా టారిఫ్‌లు గత కొన్ని సంవత్సరాలుగా తక్కువగా ఉన్నాయని, దీనిని సరిదిద్దేందుకు ఈ చర్య తీసుకోవాలని ఆపరేటర్లు భావిస్తున్నారు. అయితే టారఫ్‌ల పెంపు కారణంగా వినియోగదారులపై ఆర్థిక భారం పడే అవకాశం ఉందని, దీని ప్రభావం వినియోగ శక్తి, మార్కెట్ డైనమిక్స్‌పైనా ఉంటుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

టెలికాం రంగ ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి, భవిష్యత్ సాంకేతిక అవసరాల కోసం పెట్టుబడులను సమర్థించేందుకు టారిఫ్‌ల పెంపు అవసరమని టెలికాం ఆపరేటర్లు పేర్కొంటున్నారు. అయితే, ఈ నిర్ణయం ఖరారు కాకపోయినా, ఇది వినియోగదారుల మధ్య చర్చనీయాంశంగా మారింది. మరింత సమాచారం రానున్న నెలల్లో టెలికాం ఆపరేటర్ల నుండి వెల్లడవుతుందని భావిస్తున్నారు.





## పది రోజుల్లో కొత్త టోలింగ్ వ్యవస్థ..?

**శాటిలైట్ ఆధారిత టోలింగ్ వ్యవస్థను మే 1 నుంచి దేశవ్యాప్తంగా అమలు చేయనున్నట్లు మీడియాలో వస్తున్న వార్తలపై ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది. శాటిలైట్ ఆధారిత టోలింగ్ సిస్టమ్ ఫాస్టాగ్ ఆధారిత టోల్ కలెక్షన్ వ్యవస్థను భర్తీ చేస్తుందని రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలియజేస్తూ, 2025 మే 1 నుంచి దేశవ్యాప్తంగా ఈ సర్వీసుల అమలుకు సంబంధించి ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేసింది.**

టోల్ ప్లాజాలగుండా వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా సులువైన ప్రయాణం కోసం భవిష్యత్తులో టోల్ ప్లాజాల వద్ద 'ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్(ఏఎన్‌పీఆర్)ఫాస్టాగ్ టోలింగ్ సిస్టమ్'ను అమలు చేయనున్నట్లు తెలిపింది. ఇది వాహనాల నంబర్ ప్లేట్లను స్కాన్ చేసి రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ (ఆర్ఎఫ్ఐడీ)ను ఉపయోగించే ప్రస్తుత ఫాస్టాగ్ సిస్టమ్ ద్వారా పని చేస్తుందని పేర్కొంది. ఇది అమలులోకి వస్తే టోల్ ప్లాజాల అధిక సమయం ఆగాల్సిన అవసరం లేకుండా హై పెర్ఫార్మెన్స్ ఏఎన్‌పీఆర్ కెమెరాలు, ఫాస్టాగ్ రీడర్ల ద్వారా వెంటనే టోల్ ఛార్జీలు కట్ అయ్యేలా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది. నిబంధనలు ఉల్లంఘించిన వారికి ఈనోటీసులు జారీ చేస్తామని, వాటిని చెల్లించకపోతే ఫాస్టాగ్, ఇతర వాహన సంబంధిత సదుపాయాలను నిలిపివేయాల్సి వస్తుందని మంత్రిత్వ శాఖ పేర్కొంది.

ఎంపిక చేసిన టోల్ ప్లాజాల వద్ద 'ఏఎన్‌పీఆర్‌ఫాస్టాగ్ టోలింగ్ సిస్టమ్' అమలుకు ఎన్‌హెచ్ఏఐ ఇప్పటికే బిడ్లను ఆహ్వానించింది. ఈ వ్యవస్థ పనితీరు, సామర్థ్యం, వినియోగదారుల స్పందన ఆధారంగా దేశవ్యాప్తంగా దీని అమలుపై నిర్ణయం తీసుకోనున్నారు. భారతదేశ జాతీయ రహదారి నెట్‌వర్క్‌లో సుమారు 855 ప్లాజాలు ఉన్నాయి. వీటిలో 675 ప్రభుత్వ నిధులతో, మిగతావి ప్రైవేట్ ఆపరేటర్లతో నిర్వహిస్తున్నారు.

**శాటిలైట్ ఆధారిత టోలింగ్**
గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్ అమలులోకి వచ్చిన తరువాత టోల్ ఫీజు చెల్లించడానికి ప్రత్యేకంగా.. వాహనాలను ఆపాల్సిన అవసరం లేదు. వాహనం ప్రయాణించిన దూరాన్ని శాటిలైట్ పరిగణించి వాహనదారుల ఈవ్యాలెట్ నుంచి టోల్ ఛార్జీ కట్ అవుతుంది. అయితే దీనికోసం వాహనదారులు రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ చిప్ కలిగిన ఫాస్టాగ్‌ను వాహనానికి అతికించాల్సి ఉంటుంది. లేదా ఇతర ఆన్ బోర్డ్ యూనిట్ లేదా ట్రాకింగ్ పరికరాలను అమర్చి.. టోల్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.



## దేశంలోనే తొలి ప్రోటోటైప్ ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్.. వచ్చే ఏడాది సెప్టెంబర్ నాటికి అందుబాటులోకి

**ఈ కబురు::** భారతదేశపు మొట్టమొదటి ప్రోటోటైప్ ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ (PFBR) వచ్చే ఏడాది సెప్టెంబర్ నాటికి అందుబాటులోకి రానుంది. తమిళనాడు లోని కల్పక్కంలో ఏర్పాటు చేసిన ఈ రియాక్టర్ దేశంలోని మూడుదశల అణు ప్రాజెక్టుకు చెందిన రెండో దశను ప్రారంభించనుంది. ఇది అణు వ్యర్థాలను రీసైక్లింగ్ చేయడం ద్వారా విద్యుత్తును ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్లాంట్ ప్రారంభించడానికి అటమిక్ ఎనర్జీ రెగ్యులేటరీ బోర్డ్ధికారులు అనుమతిచ్చిన రెండేళ్ల తర్వాత ఇది సేవల్లోకి రానుండటం గమనార్హం. ఈ రియాక్టర్‌ను ఇందిరా గాంధీ సెంటర్ ఫర్ అటామిక్ రీసెర్చ్ (IGCAR) రూపొందించింది. ఇది 500 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యాన్ని కలిగి ఉంది.

అంతేగాక ఈ రియాక్టర్ ప్లూటోనియం ఆధారిత ఇంధనాన్ని ఉపయోగించడంతో పాటు శీతలీకరణ కోసం ద్రవ సోడియంను వాడుతుంది. అలాగే అత్యవరస పరిస్థితుల్లో ప్లాంట్‌ను సురక్షితంగా మూసివేసేలా తయారు చేశారు. ఇందులో 2026 నాటికి విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించాలని భావిస్తున్నారు. పీఎఫ్‌బీఆర్ భారత అణు కార్యక్రమానికి కీలకంగా మారనుంది. ఎందుకంటే ఈ రియాక్టర్ల నుంచి ఉత్పత్తి చేయబడిన ఇంధనం థోరియం ఆధారిత రియాక్టర్ల మూడో దశలో ఉపయోగించబడుతుంది. కాగా, 2024 మార్చిలో ప్రధాని నరేంద్ర మోడీ (Narendra modi) ఈ రియాక్టర్ కంట్రోల్ రూమ్ ను సందర్శించారు. ఆ తర్వాత అదే ఏడాది జూలైలో పరీక్షలకు ఏఈఆర్బీ పర్మిషన్ ఇచ్చింది.

# దూకుడు తగ్గించిన బంగారం

**దేశంలో బంగారం ధరలు గత కొన్ని వారాలుగా హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరలు, డాలర్‌తో రూపాయి మారకం రేటు, స్థానిక డిమాండ్ వంటి అంశాలు ఈ ధరలపై ప్రభావం చూపుతున్నాయి. ఏప్రిల్ 19 నాటికి దేశంలోని ప్రధాన నగరాల్లో 24 క్యారెట్, 22 క్యారెట్ బంగారం ధరలు ఈ విధంగా ఉన్నాయి..**



**చెన్నైలో..**
24 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.97,580
22 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.89,450
చెన్నైలో బంగారం ధరలు ఇతర నగరాలతో పోలిస్తే కొంచెం ఎక్కువగా ఉన్నాయి. ఇక్కడ పోర్ట్ సౌకర్యాలు, డిమాండ్ ఈ ధరలను ప్రభావితం చేస్తున్నాయి. నిన్నటితో పోలిస్తే వీటి ధరల్లో ఎలాంటి మార్పు లేదు.

**ఢిల్లీలో..**
24 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.97,730
22 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.89,600
ఢిల్లీలో బంగారం ధరలు రవాణా ఖర్చులు, స్థానిక ట్యాక్స్‌ల కారణంగా కొంత ఎక్కువగా ఉన్నాయి. అయితే ఈ నగరంలో బంగారం కొనుగోలుదారులు హాల్‌మార్క్ ఆభరణాలపై ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. నిన్నటితో పోలిస్తే వీటి ధరల్లో ఎలాంటి మార్పు లేదు.

**తెలుగు రాష్ట్రాల్లో..**
24 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.97,580
22 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.89,450
హైదరాబాద్ సహా తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో బంగారం ధరలు స్థిరంగా ఉన్నప్పటికీ, స్థానిక జ్యువెలరీ షాపుల్లో మేకింగ్ ఛార్జీలు,జీఎస్టీ కారణంగా కొంత వ్యత్యాసం కనిపిస్తుంది. నిన్నటితో పోలిస్తే వీటి ధరల్లో ఎలాంటి మార్పు లేదు.

**బంగారం ధరలపై ప్రభావం చూపే అంశాలు**
అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరలు ప్రస్తుతం ట్రాయ్ ఔన్స్‌కు 3,340 డాలర్ల వద్ద ఉన్నాయని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ తెలిపింది. భారత రూపాయి విలువ, దిగుమతి సుంకాలు, స్థానిక ట్యాక్స్‌లు, రవాణా ఖర్చులు ధరలలో వ్యత్యాసాలకు కారణమవుతున్నాయి. అదనంగా, భారతదేశంలో వివాహ సీజన్, పండుగల సమయంలో బంగారం డిమాండ్ పెరగడం వల్ల ధరలు కొంత పెరిగే అవకాశం ఉంది. బంగారం కొనుగోలు చేసే ముందు, హాల్‌మార్క్ సర్టిఫికేషన్‌ను తప్పనిసరిగా తనిఖీ చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ హాల్‌మార్క్ బంగారం స్వచ్ఛతను నిర్ధారిస్తుంది. అలాగే, వివిధ జ్యువెలరీ షాపుల్లో ధరలు, మేకింగ్ ఛార్జీలను సరిపోల్చడం ద్వారా మంచి డీల్ పొందవచ్చు. బంగారం ధరలు రాబోయే రోజుల్లో రూ.1,00,000 (10 గ్రాముల 24 క్యారెట్) మార్కును తాకే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కాబట్టి, బంగారంలో పెట్టుబడి పెట్టాలనుకునే వారు ప్రస్తుత ధరలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకోవాలి.



**వెండి ధరలు**
దేశవ్యాప్తంగా వెండి ధరలు నేడు ఎలాంటి మార్పు లేకుండా స్థిరంగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడ, చెన్నై, బెంగళూరు, ముంబై ప్రాంతాల్లో వెండి కేజీ రూ.1,10,000 వద్ద ఉండగా ఢిల్లీలో రూ. 1,00,000 వద్ద కొనసాగుతోంది.

**ముంబైలో..**
24 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.97,580
22 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.89,450
ముంబైలో బంగారం ధరలు స్థానిక డిమాండ్, జ్యువెలరీ డిజైన్‌లపై ఆధారపడి మారుతూ ఉంటాయి. ఈ నగరంలో బంగారం కొనుగోలు చేసే ముందు పలు జ్యువెలరీ షాపుల ధరలను సరిపోల్చడం మంచిది. నిన్నటితో పోలిస్తే ఇక్కడ ధరల్లో ఎలాంటి మార్పు లేదు.

**బెంగళూరులో..**
24 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.97,580
22 క్యారెట్ బంగారం (10 గ్రాములు): రూ.89,450
బెంగళూరులో బంగారం ధరలు స్థిరంగా ఉన్నాయి,

# బెంగళూరు, హైదరాబాద్‌లోని ఉద్యోగులు ఔట్..?

**గూగుల్ భారత్‌లో ఉద్యోగుల తొలగింపునకు సిద్ధమవుతోందని వార్తలొస్తున్నాయి. వాటిలోని వివరాల ప్రకారం ప్రధానంగా బెంగళూరు, హైదరాబాద్ కార్యాలయాల్లో పని చేస్తున్న వారిపై ఈ ప్రభావం పడనుంది. ప్రకటనలు, సేల్స్ అండ్ మార్కెటింగ్ బృందాల్లోని వారికి లేఆఫ్స్ ప్రకటించే అవకాశం ఉంది. దేశంలో ఉద్యోగుల తొలగింపును గూగుల్ అధికారికంగా ధ్రువీకరించనప్పటికీ లేఆఫ్స్ ప్రక్రియ వచ్చే వారం ప్రారంభం కానుందని బిజినెస్ స్టాండర్డ్ అంచనా వేసింది.**

గూగుల్ ప్లాట్‌ఫామ్స్ అండ్ డివైజెస్ విభాగంలో ఇటీవల జరిగిన పునర్వ్యవస్థీకరణ ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా వందలాది మంది ఉద్యోగులను ఇప్పటికే తొలగించారు. తాజాగా మళ్లీ ఇలా లేఆఫ్స్ వార్తలు వస్తుండడం ఉద్యోగుల్లో ఆందోళనకు కారణమవుతుంది. ఈ విభాగం ఆండ్రాయిడ్, పిక్సెల్ స్మార్ట్‌ఫోన్లు, క్రోమ్ బ్రౌజర్ వంటి కీలక ఉత్పత్తులను పర్యవేక్షిస్తుంది. అభివృద్ధి చెందుతున్న వ్యాపార ప్రాధాన్యతలకు అనుగుణంగా ఉండటానికి సంస్థ ప్రయత్నిస్తున్నందున నిర్వహణ సామర్థ్యాన్ని పెంచడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టబోతున్నట్లు తెలిసింది.




**అయితే భారత్‌లో మాత్రం ఇంజినీరింగ్ ఉద్యోగాలకు సంబంధించి గూగుల్ కాస్త మెరుగ్గా వ్యవహరిస్తుందని కూడా నివేదిక వెల్లడించింది. హైదరాబాద్, బెంగళూరు క్యాంపస్‌ల్లో టెక్నికల్ పొజిషన్లలో ఉన్న ఉద్యోగులను నేరుగా తొలగించడానికి బదులుగా ఆదాయం సమకూరే ఇతర ప్రాజెక్టుల్లో కేటాయించే అవకాశం ఉందని తెలిపింది. కంపెనీ ఇటీవల అంతర్గత నిర్మాణంలో విస్తృత మార్పులు చేసింది. గత సంవత్సరం తన ప్లాట్‌ఫామ్స్, డివైజెస్ బృందాలను విలీనం చేసింది. దాంతో భవిష్యత్తులో శ్రామిక శక్తి తగ్గింపు కోసం ఉద్యోగులకు స్వచ్ఛంద విరమణ పథకాలను ప్రవేశపెట్టింది. విలీనం తర్వాత ఉద్యోగుల క్రమబద్ధీకరణ ప్రక్రియలో భాగంగా కొన్ని తొలగింపులు జరిగాయని ఈ ఏడాది ప్రారంభంలో గూగుల్ ప్రతినిధి ఒకరు అంగీకరించారు. కంపెనీ నుంచి స్వచ్ఛందంగా నిష్క్రమించడానికి జనవరిలో తమ ఉద్యోగులకు కొన్ని ఆఫర్లు ఇచ్చినట్లు గూగుల్ ధ్రువీకరించింది.**

## జాబ్ ఆఫర్ లేకుండానే
# యూఎస్‌లో పని

**అమెరికా వెళ్లడం చాలామంది కల. ప్రపంచవ్యాప్తంగా ఇతర దేశాల్లోని నిపుణులకు యూఎస్ తమ కెరియర్ పురోగతికి అంతిమ గమ్యంగా తోస్తుంది. అభివృద్ధి చెందుతున్న పరిశ్రమలు, మెరుగైన వేతనాలు, శాశ్వత నివాసానికి అవకాశాలు ఉండటంతో అమెరికాలో పనిచేయాలని లక్ష్యంగా పెట్టుకుంటున్నారు. అయితే యూఎస్ వెళ్లేందుకు వర్కింగ్ వీసా పొందడం కష్టమే. దీనికి సాధారణంగా యూఎస్ కంపెనీ యజమాని నుంచి ఉద్యోగ ఆఫర్ అవసరం అవుతుంది. కానీ జాబ్ ఆఫర్ లేకుండానే అమెరికాలో పని చేయగలిగితే ఎలా ఉంటుంది? ఇందుకోసం కింది రెండు వీసాలు ఎంతో ఉపయోగపడుతాయి.**




**ఈబీ-2**
ఈబీ2 నేషనల్ ఇంట్రెస్ట్ వేవర్ (ఎన్ఐడబ్ల్యూ) అనేది ఉపాధి ఆధారిత వీసా. దీనికి జాబ్ ఆఫర్ లేదా ఎంప్లాయర్ స్పాన్సర్షిప్ అవసరం లేదు. ఇది శాశ్వత నివాసానికి (గ్రీన్ కార్డ్) కూడా వెసులుబాటు కల్పిస్తుంది. ఈ వీసా అధునాతన డిగ్రీలు (మాస్టర్స్ లేదా పీహెచ్‌డీ వంటివి) లేదా యునైటెడ్ స్టేట్స్ జాతీయ ప్రయోజనాలకు గణనీయంగా ప్రయోజనం చేకూర్చే రంగాల్లో అసాధారణ సామర్థ్యాలు ఉన్న వ్యక్తుల కోసం రూపొందించారు.

**ఈబీ-2కు ఎవరు అర్హులు?**
సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణితం (స్టెమ్) నిపుణులు, కళలు, వ్యాపారంలో అద్భుతమైన సహకారంతో నిపుణులు, జాతీయ లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లే పరిశోధకులు, శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు దీనికి అర్హులు. యజమానిపై ఆధారపడే హెచ్ 1బీ మాదిరిగా కాకుండా ఈబీ2 కోసం ప్రాయోజిత సంస్థ అవసరం లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆమోదం లభిస్తే అమెరికాలో శాశ్వతంగా నివాసం ఉంటూ పనిచేయవచ్చు.

### ఓ-1 వీసా

**ఓ-1 వీసా అనేది ఒకే యజమాని నుంచి స్పాన్సర్‌షిప్ అవసరం లేని వీసా. ఇది అసాధారణ సామర్థ్యాలు ఉన్నవారికి ఇస్తారు. ఇది నిపుణులు విభిన్న సంస్థల్లో పనిచేయడానికి లేదా స్వయం ఉపాధి పొందడానికి అనుమతిస్తుంది. ఆయా రంగాల్లో అసాధారణ సామర్థ్యాలున్న వ్యక్తుల కోసం ప్రత్యేకంగా దీన్ని రూపొందించారు. సైన్స్, ఆర్ట్స్, ఎడ్యుకేషన్, బిజినెస్ లేదా అథ్లెటిక్స్‌లో అసాధారణ సామర్థ్యాన్ని కలిగి ఉండాలి. వీరి పేరుపై ఆయా రంగాల్లో రికార్డులుండాలి. ఆ విజయాలకు జాతీయ లేదా అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన వ్యక్తులకు ఓ-1 నాన్ ఇమ్మిగ్రేషన్ వీసా లభిస్తుంది.**



## రియల్ఎస్టేట్‌లో తగ్గిన 'పీఈ' పెట్టుబడులు

**దేశీయ స్థిరాస్తి రంగంలోకి వచ్చిన ప్రైవేట్ ఈక్విటీ(పీఈ) పెట్టుబడులు కాస్త తగ్గాయి. 2024–25 ఆర్థిక సంవత్సరంలో వచ్చిన పెట్టుబడులు అంతకుముందు ఏడాదితో పోలిస్తే 3 శాతం మేర తగ్గినట్లు రియల్టీ కన్సల్టెంట్ అనరాక్ క్యాపిటల్ వెల్లడించింది.**

2024-25లో ఈ పెట్టుబడులు 3.7 బిలియన్ డాలర్లకు పరిమితమైనట్లు తెలిపింది. అంతకుముందు ఏడాది ఇవి 3.8 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఆఫీసు భవనాలకు ఇన్వెస్ట్‌మెంట్స్ తగ్గడమే ఈ క్షీణతకు కారణం. 2020-21లో అత్యధికంగా 6.4 బిలియన్ డాలర్ల పీఈ పెట్టుబడులు రాగా.. 2021-22లో ఇవి 4.3 బిలియన్ డాలర్లకు తగ్గాయి.

అయితే 2022-23 కల్లా 4.4 బిలియన్ డాలర్లకు పెరిగినప్పటికీ.. తర్వాత తగ్గుముఖం పట్టాయి. ఐదేళ్లుగా దేశీ రియల్టీలో పీఈ ఇన్వెస్ట్‌మెంట్స్ తగ్గుతూ వచ్చాయి. 6.4 బిలియన్ డాలర్ల నుంచి 3.7 బిలియన్ డాలర్లకు అంటే 43 శాతం మేర క్షీణించాయి.



## ఎందుకీ పైశాచిక ఆనందం.. సినిమాను చంపే హక్కు మీకు లేదు.. మిమ్మల్ని క్షమించకూడదు

నందమూరి కళ్యాణ్ రామ్, విజయశాంతి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం అర్జున్ సన్నాఫ్ వైజయంతి . ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహించిన ఈ మూవీ ఏప్రిల్ 18న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ చిత్రానికి మిక్స్‌డ్ రివ్యూలు వస్తున్నాయి. మిశ్రమ స్పందన మధ్య సినిమా తొలిరోజు దాదాపు రూ.5 కోట్ల కలెక్షన్స్ రాబట్టింది. డిస్ట్రిబ్యూటర్లు పెట్టిందంతా మంగళవారం లోపు తిరిగి వచ్చేస్తుందని కళ్యాణ్ రామ్ ధీమాగా ఉన్నాడు. అయితే విజయశాంతి మాత్రం సినిమాకు నెగెటివ్ రివ్యూ ఇచ్చినవారిపై ఆగ్రహం వ్యక్తం చేసింది.

**ఇదే మా హెచ్చరిక..**
శనివారం ఏర్పాటు చేసిన అర్జున్ సన్నాఫ్ వైజయంతి సినిమా సక్సెస్ మీట్‌లో విజయశాంతి మాట్లాడుతూ.. సినిమాను ఖూనీ చేద్దామనుకునే వారికి మా హెచ్చరిక.. సినిమాలపై తప్పుడు ప్రచారం చేసే వారు తమ పద్ధతి మార్చుకోవాలి. కొంత మంది కావాలనే శాడిజంతో సినిమాల్ని ఇబ్బందిపెడుతున్నారు. ప్రతి ఒక్క మూవీ ఆడాలనేది మా కోరిక. బాగున్న సినిమాను బాగా లేదని, బాగోలేని సినిమాను బాగుందని ప్రచారం చేయడం ఏంటి? చిన్న మూవీ అయినా పెద్ద మూవీ అయినా ఎన్నో ఆశలతో పరిశ్రమలోకి వస్తారు. సినిమా నచ్చకపోతే చూడకండి, నిశ్శబ్దంగా ఉండండి.

**సినీ ఇండస్ట్రీని బతికించండి**
సినిమా నచ్చలేదని.. ఖూనీ చేద్దామని కొన్ని దుష్ట శక్తులు ప్రయత్నిస్తున్నాయి. థియేటర్లలో ప్రజలు మా మూవీ చూసి అద్భుతంగా ఉందంటున్నారు. ప్రజలకు నచ్చిన సినిమాలపై మీకెందుకు అంత పైశాచిక ఆనందం. మనస్ఫూర్తిగా దీవించడం నేర్చుకోండి.. అంతేకానీ మంచి చిత్రాలను చంపే హక్కు మీకు లేదు. సినిమా ఇండస్ట్రీని బతికించండి. సినిమాను చంపేస్తే కొన్ని జీవితాలు పోతాయి. కోట్లు ఖర్చుపెట్టి తీసే సినిమాలను నాశనం చేసేవాళ్లను జీవితంలో క్షమించకూడదు అని విజయశాంతి పేర్కొంది.



## నటి ఖుష్బూకి తలనొప్పిగా మారిన హ్యాకర్స్

సోషల్ మీడియా ఉపయోగించడం ఏమో గానీ సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకు హ్యాకింగ్ బారిన పడుతుంటారు. నటీనటులు ట్విటర్ అకౌంట్స్ ఎప్పటికప్పుడు హ్యాక్ అవుతూనే ఉంటాయి. తాజాగా తమిళ నటి ఖుష్బూని హ్యాకర్స్ తెగ ఇబ్బంది పెడుతున్నారు. ఇంతకీ ఏం జరిగిందంటే? సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే ఖుష్బూ తరచుగా ఫొటోలు పోస్ట్ చేస్తూ ఉంటుంది. రీసెంట్ గా ఓ ఫొటో పోస్ట్ చేయగానే.. సన్నగా మారడానికి ఇంజెక్షన్ తీసుకున్నారా? అని ఓ నెటిజన్ అన్నాడు. దీంతో అతడి లెఫ్ట్ అండ్ రైట్ ఇచ్చేసింది. తాజాగా ఖుష్బూ ఫోన్ నంబర్ ఎలా తెలిసిందో ఏమో గానీ యూకేకి చెందిన కొందరు హ్యాకర్స్.. నీ ట్విటర్ ఖాతాని హ్యాక్ చేస్తున్నాం అని ఖుష్బూ వాట్సాప్ కే మెసేజ్ పంపించారు. ఈమె ట్విటర్ ఖాతా క్రిప్టో కరెన్సీకి సంబంధించిన సమాచారాన్ని హ్యాకర్స్ పోస్ట్ చేస్తున్నారు. దీంతో తమిళనాడు సైబర్ క్రైమ్ పోలీసులని ఖుష్బూ ఆశ్రయించింది. తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరింది.



## అబ్బాయిలకు పీరియడ్ పెయిన్ వస్తే అణు యుద్ధాలే: జాన్వీకపూర్

మహిళలు నెలసరి సమయంలో మానసికంగా ఎన్నో సమస్యలు ఎదుర్కొంటారని నటి జాన్వీ అన్నారు. తాజాగా దీని గురించి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు.

నెలసరి సమయంలో మహిళలు ఎదుర్కొనే బాధ వర్ణనాతీతం. శారీరకంగా, మానసికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఇక అప్పుడు వచ్చే మూడ్ స్వింగ్స్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అయితే, నెలసరిలో వచ్చే నొప్పిని చులకనగా చూస్తే అది మరింత బాధగా ఉంటుంది. ఇదే విషయాన్ని ప్రస్తావించారు నటి జాన్వీ కపూర్ . తనకు కూడా పీరియడ్ మూడ్ స్వింగ్స్ ఉన్నాయన్నారు.

"నాకు పీరియడ్స్ సమయంలో విపరీతమైన మూడ్ స్వింగ్స్ వస్తాయి. నా మాట తీరుని బట్టి నేను పీరియడ్స్‌లో ఉన్నానని ఎదుటి వారికి అర్థం అయిపోతుంది. అందుకే నేను చిరాకుగా మాట్లాడగానే 'నీకు ఇది ఆ సమయమా' అని అడుగుతారు. అయితే ఈ ప్రశ్న అడిగే విధానమే ఒక్కోసారి బాధను కలిగిస్తుంది. కొందరు ఈ నెలసరి నొప్పి అనేది చాలా చిన్న విషయంగా పరిగణిస్తూ వ్యంగంగా మాట్లాడతారు. దీన్ని అర్థం చేసుకున్నవాళ్లు మాత్రం మనకు ప్రశాంతత కలిగేలా ప్రవర్తిస్తారు. విశ్రాంతి తీసుకోమని సలహాలిస్తారు"

"పీరియడ్ పెయిన్ అనుభవించేవారికి మాత్రమే తెలుస్తుంది. ఆ సమయంలో మేం పడే బాధను, ఈ మానసిక స్థితిని అబ్బాయిలు ఒక్క నిమిషం కూడా భరించలేరని కచ్చితంగా చెప్పగలను. ఒకవేళ మగవాళ్లకు పీరియడ్స్ వస్తే ఆ నొప్పికి అణుయుద్ధాలే జరిగేవేమో..!" అని జాన్వీ చెప్పారు. ఈ విషయం గురించి ఆమె ధైర్యంగా మాట్లాడారంటూ నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. దీనిపై బహిరంగ చర్చ అవసరమని కొందరు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు.

ఇక ఇటీవల సమంత కూడా మహిళల నెలసరి సమస్యల గురించి మాట్లాడారు. ఇప్పటికీ కూడా కొందరు దీని గురించి బహిరంగంగా మాట్లాడాలంటే సిగ్గుపడుతున్నారని అన్నారు. అది పెద్ద తప్పు అన్నట్లు గుసగుసలాడుతుంటారని, ఈ ధోరణిలో మార్పు రావాలని కోరారు. ఇది మహిళల్లో జరిగే సహజ ప్రక్రియ అని తెలిపారు.

## పెళ్లిపై నాకు నమ్మకం లేదు..: త్రిష వ్యాఖ్యలు

నాలుగు పదుల వయసులోనూ వరుస సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తున్నారు నటి త్రిష . అయితే, ఆమె వైవాహిక బంధంలోకి ఎప్పుడు అడుగు పెడుతుందా అని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఆమె పెళ్లి గురించి ఇప్పటికే ఎన్నో వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో తాజాగా ఆమె వివాహంపై తన అభిప్రాయాన్ని బయటపెట్టారు. తనకు పెళ్లిపై సదుద్దేశం లేదని వ్యాఖ్యలు చేశారు. 'థగ్ లైఫ్' ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమెను.. 'మూడుముళ్ల బంధంపై మీ అభిప్రాయం ఏమిటి?' అని ప్రశ్నించగా.. "నిజం చెప్పాలంటే నాకు వివాహంపై నమ్మకం లేదు. నాకు పెళ్లి అయినా ఓకే, కాకపోయినా ఫర్వాలేదు" అని ఆమె బదులిచ్చారు. ఆమె ఇచ్చిన సమాధానంతో పక్కనే ఉన్న కమల్‌హాసన్ షాకయ్యారు.

త్రిష పెళ్లి గురించి కొంతకాలంగా వదంతులు వ్యాప్తి చెందుతోన్న విషయం తెలిసిందే. ఆమె ప్రేమలో ఉన్నారని త్వరలోనే పెళ్లి పీటలెక్కనున్నారని ఇటీవల ప్రచారం జరిగింది. ఆ వదంతులను ఆమె ఖండించారు. "పెళ్లి ఎందుకు చేసుకోలేదు అంటే నా వద్ద సమాధానం లేదు. పెళ్లి ఎప్పుడు చేసుకుంటానో మాత్రం నాకే తెలియదు. నా మనసుకు నచ్చిన వ్యక్తి దొరికితే కచ్చితంగా చేసుకుంటాను. నన్ను పెళ్లి చేసుకోబోయేవాడు జీవితాంతం నాకు తోడు ఉంటాడనే నమ్మకం కలగాలి. అప్పుడే చేసుకుంటాను. పెళ్లి చేసుకొని విడాకులు తీసుకోవడం నాకు ఇష్టం లేదు. పెళ్లి చేసుకొని చాలామంది అసంతృప్తితో జీవిస్తున్నారు. అలాంటి పరిస్థితి నాకు ఎదురుకాకూడదు" అని ఓ సందర్భంలో చెప్పారు.





## శ్రీదేవిగా తమన్నా..! మా అమ్మ స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరన్న ఖుషి కపూర్

దక్షిణాది నుంచి ఉత్తరాదికి వెళ్లి ఒక ఊపు ఊపిన కథానాయికల్లో నెం.1 స్థానంలో ఉంటారు శ్రీదేవి . భారతీయ సినిమాకు 'మొదటి మహిళా సూపర్ స్టార్'గా శ్రీదేవి మూస పద్ధతులను బద్దలు కొట్టారు. కామెడీ నుంచి ట్రాజెడీ వరకు వైవిధ్యమైన శైలిలో విస్తృతమైన పాత్రలను పోషించారు. దాదాపు 50 సంవత్సరాలకు పైగా తెలుగు, తమిళం, హిందీ, మలయాళం కన్నడ భాషా చిత్రాలతో ఆమె కెరీర్ నలుదిశలా విస్తరించింది.

**సౌత్.. నార్త్.. అన్నింటా తనదే హవా**
దక్షిణాదిలో అన్ని భాషా చిత్రాల్లో విజయాలు ఒకెత్తయితే బాలీవుడ్‌లో మరో ఎత్తు. 'మిస్టర్ ఇండియా,' 'సద్మా,' 'హిమ్మత్వాలా,' 'ఖుదా గవా,' ''లాడ్లా,' 'జుదాయి,' 'ఇంగ్లీష్ వింగ్లీష్' వంటి సూపర్ హిట్స్‌తో ఆమె బాలీవుడ్ ప్రేక్షకుల కలలరాణిగా కళకళలాడారు. ఆమె చివరి చిత్రం క్రైమ్ థ్రిల్లర్ 'మామ్' 2017లో విడుదలైంది. ఇది అందరికీ తెలిసిన శ్రీదేవి.. అయితే తెలియని శ్రీదేవి గురించి ఎలా తెలుస్తుంది?

**శ్రీదేవి బయోపిక్‌లో నటించాలనుంది: తమన్నా**
ఇప్పుడు బయోపిక్‌ల శకం నడుస్తోంది. సిల్క్ స్మిత నుంచి శ్రీదేవి దాకా తారల జీవితాలను తెరకెక్కించాలని సినిమా పరిశ్రమ ఉవ్విళ్లూరుతోంది. గత కొంత కాలంగా శ్రీదేవి జీవిత కథను సినిమాగా రూపొందించాలన్న చర్చలు నడుస్తున్నాయి. అదే సమయంలో ఆ పాత్రను ఎవరు పోషిస్తే బాగుంటుంది? అనే చర్చ కూడా వస్తోంది. ఈ నేపథ్యంలో దివంగత తార శ్రీదేవి ''సూపర్ ఐకానిక్'' కాబట్టి తెరపై ఆమె పాత్రను పోషించాలనుకుంటున్నట్లు నటి తమన్నా భాటియా ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. 'శ్రీదేవి, మేడమ్. సూపర్ ఐకానిక్ ఆమె నాకు ఇన్స్పిరేషన్. చిన్నప్పటి నుంచీ ఆమె సినిమాలు చూస్తూ పెరిగాను... నేను ఎప్పుడూ మెచ్చుకునే వ్యక్తి ఆమె' అని తమన్నా భాటియా ఓ ఇంటర్వ్యూలో చెప్పారు.

**ఆమె స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరు**
మరి నిజంగా తమన్నాకు శ్రీదేవి పాత్ర పోషించి మెప్పించే స్థాయి ఉందా? ఈ ప్రశ్నకు సినీ పండితుల నుంచి ఇంకా సరైన సమాధానం రాలేదు కానీ.. శ్రీదేవి చిన్న కుమార్తె నుంచి పదునైన సమాధానమే వచ్చింది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఖుషి కపూర్ ... తన తల్లిలా మరెవరూ కాలేరని, ఆమె స్థానాన్ని మరొకరు ఎప్పటికీ భర్తీ చేయలేరని కుండ బద్దలు కొట్టారు. ఆమెలా చిన్నప్పటి నుంచి నటనపై అంతటి అంకితభావం. అద్వితీయమైన ప్రతిభను ఎవరూ ప్రతిబింబించలేరని ఆమె స్పష్టం చేశారు.

**తను ప్రత్యేకమైన సృష్టి**
ఇతరులకే కాదు తమకి కూడా అమ్మ స్థానం అసాధ్యమని ఆమె పరోక్షంగా తేల్చేశారు. తనపై ఆమె సోదరి జాన్వీపై శ్రీదేవి చూపిన ప్రభావం సాధారణమైనది కాదన్నారు. అయినప్పటికీ 'రాబోయే 100 ఏళ్లలో కూడా నేను మా అమ్మలా కాలేను. ఆమె వేరే... ప్రత్యేకమైన సృష్టి' అంటూ తన తల్లిలా కావాలంటే మరో జన్మ ఎత్తాల్సిందే అంటూ ఓ ఇంటర్వ్యూలో పరోక్షంగా స్పష్టం చేశారు.



# పోరాడి ఓడిన రాజస్థాన్.. రెండు పరుగుల తేడాతో లఖ్‌నవూ విజయం



**ఐపీఎల్ 18 సీజన్‌లో భాగంగా రాజస్థాన్ రాయల్‌స్‌తో జరిగిన మ్యాచ్‌లో 2 పరుగుల తేడాతో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ విజయం సాధించింది.**

జైపుర్: రాజస్థాన్ రాయల్స్ మరోసారి గెలుపు ముంగిట బోల్తాపడింది. దిల్లీతో మ్యాచ్‌లో సూపర్ ఓవర్‌లో ఓటమి పాలైన ఆ జట్టు.. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ తో జరిగిన మ్యాచ్‌లో రెండు పరుగుల తేడాతో పరాజయం చవి చూసింది. తొలుత బ్యాటింగ్ చేసిన లఖ్‌నవూ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో రాజస్థాన్ 5 వికెట్లు కోల్పోయి 178 పరుగులు చేసింది. యశస్వి జైస్వాల్ (74; 52 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్స్‌లు), అరంగేట్ర ఆటగాడు వైభవ్ సూర్యవంశీ (34; 20 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), రియాన్ పరాగ్ (39; 26 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరవడంతో సునాయసంగా విజయం సాధించేలా కనిపించింది. లఖ్‌నవూ పేసర్ అవేశ్ ఖాన్ తన చివరి రెండు ఓవర్లలో అద్భుతంగా బౌలింగ్ చేశాడు. 18 ఓవర్‌లో జైస్వాల్, రియాన్ పరాగ్‌ను ఔట్ చేసి మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. ఆఖరి ఓవర్‌లో రాజస్థాన్ విజయానికి 9 పరుగులు అవసరం కాగా.. అవేశ్ 6 పరుగులే ఇచ్చి హెట్‌మయర్ (12)ను ఔట్ చేశాడు. శార్దూల్ ఠాకూర్, మార్‌క్రమ్ చెరో వికెట్ తీశారు. లఖ్‌నవూకు ఇది ఐదో విజయం కాగా.. రాజస్థాన్‌కు వరుసగా నాలుగో ఓటమి.

తొలుత బ్యాటింగ్ చేసిన లఖ్‌నవూ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది. ఓపెనర్ ఐడెన్ మార్‌క్రమ్ (66; 45 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), మిడిల్ ఆర్డర్ బ్యాటర్ ఆయుష్ బదోని (50; 34 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ శతకాలు బాదారు. ఇన్నింగ్స్ చివరి ఓవర్‌లో అబ్దుల్ సమద్ (30*; 10 బంతుల్లో) నాలుగు సిక్స్‌లు బాదడంతో స్కోరు 180కి చేరింది. మిచెల్ మార్ష్ (4), నికోలస్ పూరన్ (11), రిషభ్ పంత్ (3) విఫలమయ్యారు. ఈ క్రమంలో మార్‌క్రమ్, బదోని జోడీ నాలుగో వికెట్‌కు 76 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. మార్‌క్రమ్ 31 బంతుల్లో అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. 33 బంతుల్లో హాఫ్ సెంచరీ అందుకున్న బదోని.. తర్వాత బంతికే ఔటయ్యాడు. రాజస్థాన్ రాయల్స్ బౌలర్లలో వానిందు హసరంగ 2, జోఫ్రా ఆర్చర్, సందీప్ శర్మ, తుషార్ దేశ్‌పాండే ఒక్కో వికెట్ పడగొట్టారు.





## ఐపీఎల్‌లో అరంగేట్రం.. చరిత్ర సృష్టించిన వైభవ్ సూర్యవంశీ

**టీనేజ్ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ చరిత్ర సృష్టించాడు. అతి పిన్న వయసు (14 ఏళ్ల 23 రోజులు)లో ఐపీఎల్‌లో అరంగేట్రం చేసిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు.**

టీనేజ్ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ చరిత్ర సృష్టించాడు. అతి పిన్న వయసు (14 ఏళ్ల 23 రోజులు)లో ఐపీఎల్‌లో అరంగేట్రం చేసిన ఆటగాడిగా రికార్డుల్లోకెక్కాడు. అంతకుముందు ఈ ఘనత ప్రయాస్ రే బర్మన్ (16 ఏళ్ల 157 రోజులు) పేరిట ఉంది. ఐపీఎల్ 2025లో రాజస్థాన్ రాయల్స్ కు ప్రాతినిధ్యం వహిస్తున్న వైభవ్.. లఖ్‌నవూ సూపర్ జెయింట్‌స్‌తో జరుగుతున్న మ్యాచ్‌తో అరంగేట్రం చేశాడు. తుది జట్టులో చోటు దక్కకపోయినా ఇంపాక్ట్ ప్లేయర్‌గా బ్యాటింగ్‌కు దిగాడు. ఎదుర్కొన్న తొలి బంతినే సిక్సుగా మలచడం విశేషం. మొత్తం మీద 20 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌ల సాయంతో 34 పరుగులు చేశాడు. జోరుమీదున్న వైభవ్.. మార్‌క్రమ్ బౌలింగ్‌లో స్టంపౌట్‌గా వెనుదిరిగాడు. బిహార్‌కు చెందిన ఈ కుర్రాడు గతేడాది మెగా వేలంలో రూ.1.10 కోట్ల ధర పలికాడు. దిల్లీ క్యాపిటల్‌స్‌తో పోటీపడి మరీ అతన్ని రాజస్థాన్ రాయల్స్ దక్కించుకుంది. వేలంలో అమ్ముడుపోయిన అతిపిన్న వయసు ఆటగాడిగానూ వైభవ్ రికార్డు సృష్టించాడు.

ఐపీఎల్‌లో అతిపిన్న వయసులో అరంగేట్రం చేసిన క్రికెటర్లు

వైభవ్ సూర్యవంశీ (14 ఏళ్ల 23 రోజులు.. రాజస్థాన్ రాయల్స్, 2025)
ప్రయాస్ రే బర్మన్ (16 ఏళ్ల 157 రోజులు.. ఆర్సీబీ, 2019)
ముజీబుర్ రెహ్మాన్ (17 ఏళ్ల 11 రోజులు.. పంజాబ్ కింగ్స్, 2018)
రియాన్ పరాగ్ (17 ఏళ్ల 152 రోజులు.. రాజస్థాన్ రాయల్స్, 2019)
ప్రదీప్ సాంగ్వాన్ (17 ఏళ్ల 179 రోజులు.. దిల్లీ డేర్‌డెవిల్స్, 2008)
సర్ఫరాజ్ ఖాన్ (17 ఏళ్ల 182 రోజులు.. ఆర్సీబీ, 2015)
వాషింగ్టన్ సుందర్ (17 ఏళ్ల 199 రోజులు.. రైజింగ్ పుణె సూపర్ జెయింట్స్, 2017)
రాహుల్ చాహర్ (17 ఏళ్ల 247 రోజులు.. రైజింగ్ పుణె సూపర్ జెయింట్స్, 2017)
అభిషేక్ శర్మ (17 ఏళ్ల 250 రోజులు.. దిల్లీ క్యాపిటల్స్, 2018)
ఇషాన్ కిషన్ (17 ఏళ్ల 262 రోజులు.. గుజరాత్ లయన్స్, 2017)

## సమష్టిగా రాణించిన దిల్లీ బ్యాటర్లు.. ప్రసిద్ధ్‌కు 4 వికెట్లు.. గుజరాత్ టార్గెట్ 204



**ఐపీఎల్ 2025లో భాగంగా గుజరాత్ టైటాన్‌స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో దిల్లీ క్యాపిటల్స్ బ్యాటర్లు సమష్టిగా రాణించారు.**

అహ్మదాబాద్: ఐపీఎల్ 2025లో భాగంగా గుజరాత్ టైటాన్స్ తో జరుగుతున్న మ్యాచ్‌లో దిల్లీ క్యాపిటల్స్ బ్యాటర్లు సమష్టిగా రాణించారు. దీంతో డీసీ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 203 పరుగులు చేసింది. ఓపెనర్లు అభిషేక్ పొరెల్ (18; 9 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), కరుణ్ నాయర్ (31; 18 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) క్రీజులో ఉన్నంతసేపు మెరుపులు మెరిపించారు. తర్వాత వచ్చిన కేఎల్ రాహుల్ (28; 14 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడాడు. అక్షర్ పటేల్ (38; 32 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు), ట్రిస్టన్ స్టబ్స్ (31; 21 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. చివర్లో అశుతోష్ శర్మ (37; 19 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) విరుచుకుపడ్డాడు. గుజరాత్ బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ (4/41) అర్షద్ ఖాన్, సిరాజ్, ఇషాంత్ శర్మ, సాయి కిశోర్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

దిల్లీకి శుభారంభం లభించింది. సిరాజ్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లో పొరెల్ రెండు ఫోర్లు, ఓ సిక్సర్ బాదేశాడు. జోరుమీదున్న పొరెల్‌ని అర్షద్ ఖాన్ ఔట్ చేశాడు. వికెట్ పడినా తర్వాత వచ్చిన రాహుల్ దూకుడు ప్రదర్శించాడు. సిరాజ్ బౌలింగ్‌లో వరుసగా ఫోర్, సిక్స్ కొట్టాడు. కరుణ్ నాయర్ కూడా ఓ సిక్స్ బాదాడు. అర్షద్ వేసిన నెక్స్ట్ ఓవర్‌లో రాహుల్ రెండు బౌండరీలు రాబట్టాడు. దీంతో 4 ఓవర్లకే స్కోరు 50 దాటింది. తర్వాత రాహుల్‌ని ప్రసిద్ధ్ కృష్ణ ఎల్బీడబ్ల్యూగా వెనక్కి పంపాడు. మరోవైపు, కరుణ్ ధాటిగా ఆడటంతో పవర్ ప్లే ముగిసేసరికి దిల్లీ 73/2 స్కోరుతో నిలిచి భారీ స్కోరుకు బలమైన పునాది వేసుకుంది. కాసేపటికే ప్రసిద్ధ్ బౌలింగ్‌లో కరుణ్.. సిరాజ్‌కు చిక్కాడు. ఈ క్రమంలో అక్షర్ పటేల్, ట్రిస్టన్ స్టబ్స్ నిలకడగా ఆడి స్కోరు వేగం తగ్గకుండా చూసుకున్నారు. స్టబ్స్‌ని సిరాజ్ వెనక్కి పంపడంతో 53 పరుగుల భాగస్వామ్యానికి తెరపడగా 15 ఓవర్లకు దిల్లీ 150/4 స్కోరుతో నిలిచింది. అర్షద్ ఖాన్ వేసిన 16 ఓవర్‌లో అశుతోష్ వరుసగా రెండు సిక్సర్లు బాదాడు. ప్రసిద్ధ్ 18 ఓవర్‌లో వరుస బంతుల్లో అక్షర్, విప్రాజ్ నిగమ్ (0)ని ఔట్ చేశాడు. వీరిద్దరూ వికెట్‌కీపర్ బట్లర్‌కే క్యాచ్ ఇచ్చారు. అదే ఓవర్‌లో అశుతోష్ వరుసగా రెండు సిక్స్‌లు కొట్టాడు. చివరి రెండు ఓవర్లలో దిల్లీ 15 పరుగులు చేసి రెండు వికెట్లు కోల్పోయింది.

## బాదేసిన బట్లర్.. గుజరాత్ టైటాన్స్‌కు ఐదో విజయం





**దిల్లీ క్యాపిటల్‌స్‌తో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది.**

అహ్మదాబాద్: ఐపీఎల్ 2025లో గుజరాత్ టైటాన్స్ ఐదో విజయం అందుకుంది. సొంతగడ్డపై దిల్లీ క్యాపిటల్స్ తో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ 7 వికెట్ల తేడాతో గెలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన డీసీ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 203 పరుగులు చేసింది. ఈ భారీ లక్ష్యాన్ని గుజరాత్ 19.2 ఓవర్లలో ఛేదించింది. వన్‌డౌన్ బ్యాటర్ జోస్ బట్లర్ (97*; 54 బంతుల్లో 48 బంతుల్లో 11 ఫోర్లు, 4 సిక్స్‌లు) త్రుటిలో సెంచరీ మిస్ చేసుకున్నాడు. ఓపెనర్ సాయి సుదర్శన్ (36; 21 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడాడు. షెర్ఫాన్ రూథర్‌ఫోర్డ్ (43; 33 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్స్‌లు) రాణించాడు. చివరి ఓవర్‌లో గుజరాత్ విజయానికి 10 పరుగులు అవసరం కాగా.. రాహుల్ తెవాతియా (11*; 3 బంతుల్లో) వరుసగా సిక్స్, ఫోర్ కొట్టి మ్యాచ్‌ను ముగించాడు. ఏడు మ్యాచ్‌ల్లో దిల్లీకిది ఇది రెండో ఓటమి. ఐపీఎల్‌లో గుజరాత్‌కు ఇదే అత్యధిక విజయవంతమైన లక్ష్యఛేదన.

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిల్లీ.. బ్యాటర్లలందరూ సమష్టిగా రాణించడంతో భారీ స్కోరు చేసింది. ఓపెనర్లు అభిషేక్ పొరెల్ (18; 9 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), కరుణ్ నాయర్ (31; 18 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) క్రీజులో ఉన్నంతసేపు మెరుపులు మెరిపించారు. తర్వాత వచ్చిన కేఎల్ రాహుల్ (28; 14 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడాడు. అక్షర్ పటేల్ (38; 32 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు), ట్రిస్టన్ స్టబ్స్ (31; 21 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. చివర్లో అశుతోష్ శర్మ (37; 19 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) విరుచుకుపడ్డాడు. గుజరాత్ బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ (4/41) అర్షద్ ఖాన్, సిరాజ్, ఇషాంత్ శర్మ, సాయి కిశోర్ ఒక్కో వికెట్ పడగొట్టారు.



## ఉప్పల్ స్టేడియంలో నార్త్ స్టాండ్‌కు అజారుద్దీన్ పేరు తొలగింపు



**ఉప్పల్ స్టేడియంలో నార్త్ స్టాండ్‌కు అజారుద్దీన్ పేరు తొలగించాలని అంబుడ్‌స్మన్ జస్టిస్ ఈశ్వరయ్య హెచ్‌సీఏను ఆదేశించారు.**

హైదరాబాద్: ఉప్పల్ స్టేడియంలో నార్త్ స్టాండ్‌కు అజారుద్దీన్ పేరు తొలగించాలని అంబుడ్‌స్మన్ జస్టిస్ ఈశ్వరయ్య హెచ్‌సీఏను ఆదేశించారు. లార్డ్స్ క్రికెట్ క్లబ్ వేసిన పిటిషన్‌పై ఆయన ఇవాళ విచారణ చేపట్టారు. 'హెచ్‌సీఏ అధ్యక్షుడిగా అజారుద్దీన్ తన పేరు పెట్టుకోవాలని నిర్ణయించారు. ఈ నిర్ణయం చెల్లదు. ఇందులో విరుద్ధమైన ప్రయోజనాలున్నాయి' అని జస్టిస్ ఈశ్వరయ్య తీర్పునిచ్చారు. వెంటనే నార్త్ స్టాండ్‌కు అజారుద్దీన్ పేరు తొలగించాలని హెచ్‌సీఏను ఆదేశించారు. టికెట్లపై ఇకనుంచి ఆ పేరు ప్రస్తావన ఉండొద్దని తేల్చి చెప్పారు.

## టీమ్‌ఇండియా సహాయక కోచ్‌పై వేటు.. కోల్‌కతా నైట్‌రైడర్స్‌లోకి రీ ఎంట్రీ



**అభిషేక్ నాయర్ ను కోల్‌కతా నైట్‌రైడర్స్ అసిస్టెంట్ కోచ్‌గా నియమించుకుంది.**

భారత జట్టు సహాయక కోచ్ అభిషేక్ నాయర్ పై రెండ్రోజుల కిందట బీసీసీఐ వేటు వేసిన సంగతి తెలిసిందే. బాధ్యతలు చేపట్టిన 8 నెలలకే పదవి నుంచి తొలగించింది. దీంతో అభిషేక్ తిరిగి కోల్‌కతా నైట్‌రైడర్స్‌లో చేరాడు. కేకేఆర్ అతడిని సహాయక కోచ్‌గా తీసుకుంది. అభిషేక్‌ను అసిస్టెంట్ కోచ్‌గా నియమించుకున్నట్లు కోల్‌కతా నైట్‌రైడర్స్ సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టింది. 2024 ఐపీఎల్ సీజన్‌లో గౌతమ్ గంభీర్ కేకేఆర్‌కు మెంటార్‌గా ఉండగా.. అభిషేక్ సహాయక కోచ్‌గా వ్యవహరించాడు. గతేడాది కోల్‌కతా ఛాంపియన్‌గా నిలవడంలో వీరిద్దరూ కీలకపాత్ర పోషించారు. అనంతరం టీమ్‌ఇండియా ప్రధాన కోచ్‌గా నియమితుడైన గంభీర్.. అభిషేక్‌ను తన బృందంలో చేర్చుకున్నాడు. ఇక, నాయర్‌పై వేటుకు న్యూజిలాండ్, ఆస్ట్రేలియాలతో టెస్టు సిరీస్‌ల్లో భారత్ పరాజయాలే కారణమని చెబుతున్నప్పటికీ.. శిక్షణ బృందంలోని కీలక వ్యక్తితో విభేదాల వల్లే పదవి కోల్పోవాల్సి వచ్చిందని సమాచారం.

## ఫైనల్లో అనాహత్, వీర్



ప్రపంచ స్క్వాష్ ఛాంపియన్‌షిప్ ఆసియా క్వాలిఫయింగ్ టోర్నమెంట్‌లో భారత రైజింగ్ స్టార్ అనాహత్ సింగ్, వీర్ చోత్రాని ఫైనల్లోకి దూసుకెళ్లారు. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో ఐదో సీడ్, 17 ఏళ్ల అనాహత్ 11-2, 11-7, 11-6తో హెలెన్ టాంగ్ (హాకాంగ్)పై విజయం సాధించింది. 21 నిమిషాల్లో ముగిసిన పోరులో అనాహత్... ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా చెలరేగింది. ఇప్పటి వరకు ఈ ఇద్దరి మధ్య ఐదు మ్యాచ్‌లు జరగగా... అన్నింట్లోనూ అనాహత్ విజయం సాధించడం విశేషం. ఆదివారం జరగనున్న ఫైనల్లో టోబీ ట్సె (హాంకాంగ్)తో అనాహత్ తలపడనుంది. భారత మరో ప్లేయర్, రెండో సీడ్ ఆకాంక్ష పరాజయం పాలైంది. 3-11, 10-12, 12-10, 8-11తో టోబీ ట్సె చేతిలో ఓడింది. మరోవైపు విభాగంలో భారత ప్లేయర్ వీర్ చోత్రాని కూడా ఫైనల్లో అడుగు పెట్టాడు. సెమీ ఫైనల్లో వీర్ చోత్రాని 11-7, 11-6, 7-11, 11-4తో ఎనిమిదో సీడ్ చి హిమ్ వాంగ్ (హాంకాంగ్)పై విజయం ఈ టోర్నీలో విజేతగా నిలిచిన ప్లేయర్లు మే 9 నుంచి 17 వరకు చికాగోలో జరిగే ప్రపంచ ఛాంపియన్‌షిప్ పోటీలకు అర్హత సాధిస్తారు.

## ఆసియా అండర్-18 ఛాంపియన్‌షిప్‌లో అదరగొడుతున్న యువ అథ్లెట్లు.. ఒకే రోజు నాలుగు మెడల్స్



సౌదీ అరేబియాలో జరుగుతున్న ఆసియా అండర్ 18 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో భారత యువ అథ్లెట్లు సత్తాచాటుతున్నారు. పతక పంట పండిస్తున్నారు. శుక్రవారం ఒకే రోజు స్వర్ణం సహా నాలుగు పతకాలు దక్కాయి. యువ జావెలిన్ త్రోయర్ హిమాన్షు గోల్డ్ మెడల్ దక్కించుకున్నాడు. 67.57 మీటర్ల త్రోతో అగ్రస్థానంలో నిలిచాడు. హై జంప్ ఈవెంట్‌లో దేవక్ భూషన్ 2.03 మీటర్ల ప్రదర్శనతో రజతం కొల్లగొట్టాడు. గర్ల్స్ 200 మీటర్ల రేసులో ఆర్తి కాంస్య పతకం దక్కించుకుంది. 24.31 సెకన్లలో గమ్యాన్ని చేరుకుని మూడో స్థానంలో నిలిచింది. అలాగే, పర్సనల్ బెస్ట్ ప్రదర్శన చేసింది. ఆర్తికి ఇది రెండో పతకం. 100 మీటర్ల రేసులో కూడా ఆమె బ్రాంజ్ మెడల్ సాధించింది. అలాగే, బాయ్స్ మెడ్లీ రిలే ఈవెంట్‌లో భారత జట్టు సత్తాచాటింది. చిరంత్, సాకేత్ మింజ్, సయెద్ సబీర్, కదిర్ ఖాన్‌లతో కూడిన భారత జట్టు 1:52.15 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకుని రెండో స్థానంలో నిలిచి రజత పతకం సాధించింది. అంతేకాకుండా, కొత్త నేషనల్ రికార్డు నెలకొల్పింది.